


# ప్రచార జోరు

- మండలి స్థానంపై నేతల కన్ను
- ఆత్మీయ సమ్మేళనాలు, సమావేశాలు
- ఎమ్మెల్సీ బరిలో ఆలపాటి, లక్ష్మణరావు
- పట్టభద్ర ఎన్నికల నుంచి తప్పుకున్న వైసీపీ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలపరిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) బలపరిచిన కేఎస్ లక్ష్మణరావు ప్రధాన అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. వీరిద్దరూ ప్రచారంలో జోరు పెంచారు. ఆత్మీయ సమ్మేళనాలు, సమావేశాలతో దూసుకుపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన వీరిద్దరి మధ్య పోటీ ఆసక్తికరంగా మారింది. బరి నుంచి వైసీపీ తప్పుకున్నా ఎన్నిక పోటాపోటీగా జరిగే అవకాశం ఉంది. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే కేఎస్ లక్ష్మణరావు ఓటర్లను అకట్టుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఆలపాటికి కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు, లక్ష్మణరావుకు ఉద్యోగులు, ఉపాధ్యాయ యూనియన్లు అండగా ఉన్నాయి. ఇద్దరికీ పట్టభద్రులతో సత్సంబంధాలు ఉన్నాయి. ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కూటమి నేతలు భారీ మెజార్టీతో గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఓటర్లను ప్రత్యేకంగా కలిసి ఆలపాటికి మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.

## చంద్రబాబుకు సన్నిహితుడు.. ఆలపాటి

స్వాతంత్ర్య సమరయోధుడు ఆలపాటి శివరామకృష్ణ తనయుడైన రాజేంద్రప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి అత్యంత సన్నిహితులు. స్టూడెంట్స్ వర్కింగ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పని చేశారు. బీఎల్ పూర్తి చేశారు. 1994 అసెంబ్లీ ఎన్నికల్లో వేమూరు నుంచి గెలుపొందారు. రెండోసారి 1999 లో గెలిచాక విద్యాశాఖ మంత్రిగా పని చేశారు. 2004, 2009 ఎన్నికల్లో ఓడిపోయారు. 2014లో విజయం సాధించారు. 2019లో ఓటమి చెందారు. 2024లో ఆయన తెనాలి నుంచి పోటీ చేయాలనుకున్నా కూటమి పొత్తులో తెనాలి సీటును నాదెండ్ల మనోహర్‌కు త్యాగం చేయాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో ఆలపాటికి మండలి బరిలో నిలిచే అవకాశం దక్కింది. ఈ క్రమంలో ఆలపాటి విజయానికి కూటమి భాగస్వామ్య పక్షాలు కలిసికట్టుగా పనిచేస్తున్నాయి. ఇప్పటికే నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పట్టభద్రులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి ఆలపాటికి మద్దతు కూడగడుతున్నారు. సోషల్ మీడియా ద్వారా కూడా ప్రచార హోరు పెంచారు. ఆలపాటి గెలుపు బాధ్యతలను టీడీపీ అధిష్ఠానం ఎమ్మెల్యేలకు అప్పగించింది. దీంతో ఎమ్మెల్యేలు తమ సొంత ఎన్నికగా ఎమ్మెల్సీ ఎన్నికను స్వీకరించారు. ఆలపాటి గెలుపు లాంఛనమేనని భారీ మెజార్టీనే లక్ష్యమని ఎమ్మెల్యేలు చెబుతున్నారు.

### ఆలపాటి నామినేషన్ దాఖలు.. నేడు లక్ష్మణరావు

కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ 7న నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఎమ్మెల్యేలు, మంత్రులు, కూటమి ముఖ్యనేతలు నామినేషన్ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కేఎస్ లక్ష్మణరావు సోమవారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత నామినేషన్ దాఖలు చేసేందుకు నిర్ణయించుకున్నారు. ముందుగా ఉదయం 10 గంటలకు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, పెన్షనర్స్, ప్రజా సంఘాలతో సభ నిర్వహించిన అనంతరం భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగనుంది. ర్యాలీ అనంతరం కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ అభ్యర్థిగా లక్ష్మణరావు నామినేషన్ దాఖలు చేయనున్నారు. వివిధ సంఘాలు, అసోసియేషన్ నేతలు కేఎస్‌కు మద్దతుగా నామినేషన్ కార్యక్రమానికి తరలిరానున్నారు.



కుంచనపల్లిలో జరిగిన డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

## సిట్టింగ్ ఎమ్మెల్సీగా.. లక్ష్మణరావు

సిట్టింగ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఈ ఎన్నికల బరిలోనూ నిలిచారు. గుంటూరు జిల్లాలో జన్మించిన ఆయన హిందూ కళాశాలలో రాజకీయ శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేశారు. యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్)లో చురుగ్గా ఉంటూ ఉపాధ్యాయుల హక్కులు, ప్రయోజనాల కోసం అనేక ఉద్యమాలు చేశారు. 2007లో తొలిసారిగా కృష్ణా- గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2009 ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి పోటీపడి ఎక్కువ మెజారిటీతో విజయం సాధించారు. 2015లో ఓటమి చెందారు. 2019లో కృష్ణా-గుంటూరు పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. లక్ష్మణరావు హిందూ కాలేజీ అధ్యాపకుడిగానే కాకుండా పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తూ పట్టభద్రులకు సుపరిచితులు. గ్రూప్-1 పరీక్షలకు శిక్షణతో పాటు ఐఏ ఎస్ కావాలనుకునే వారికి శిక్షణ ఇచ్చేవారు. ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ, అధ్యాపక అసోసియేషన్లను ఆధారంగా చేసుకుని ఆయన విస్తృత ప్రచారం చేస్తున్నారు. వామపక్షాలు ఆయనకు మద్దతుగా నిలిచాయి. వైసీపీ పోటీలో లేకపోవడంతో ఆ పార్టీ పరోక్షంగా లక్ష్మణరావుకు మద్దతు తెలిపే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం ఉంది.



ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాకు మద్దతుగా వినుకొండలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

### నేటితో నామినేషన్లు సమాప్తం

గుంటూరు (ఆంధ్ర జ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ల ఘట్టం సోమవారంతో ముగియనుంది. ఈ నెల 3 నుంచి ప్రారంభమైన నామినేషన్ల స్వీకార ప్రక్రియ ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం సోమవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగనుంది. ఆ సమయంలోపు గుంటూరు కలెక్టరేట్ ప్రాంగణంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి వచ్చిన అభ్యర్థుల నామినేషన్లను మాత్రమే స్వీకరిస్తారు. నిర్ణీత సమయం మూడు గంటలకు కలెక్టరేట్ గేటుకు తాళం వేసి ఆ తర్వాత ఎవరైనా వస్తే లోనికి అనుమతించబోమని అధికారవర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో చివరి రోజైన సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చే అభ్యర్థులు, వారి మద్దతు దారులతో కలెక్టరేట్ పరిసరాలు కోలా హలంగా మారనున్నాయి.



# మధ్యాహ్న భోజనంలో.. మార్పులు


- సన్నబియ్యంతో విద్యార్థులకు భోజనం
- బడికి వచ్చిన వారందరూ తినేలా ప్రణాళిక
- పథకం ప్రక్షాళనకు విద్యా మంత్రి లోకేశ్ ఆమోదం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సన్నబియ్యంతో అన్నం.. రుచికరమైన కూరలతో.. పాఠశాలలకు హాజరైన వారందరూ తప్పనిసరిగా భోజనం చేసేలా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో మార్పులు తీసు కొచ్చారు. ఆయా మార్పులకు విద్యాశాఖ మంత్రి లోకేశ్ అనుమతి ఇచ్చారు. మధ్యాహ్నభోజన పథకంపై గురువారం జరిగిన సమీక్షలో మంత్రిలోకేశ్ విద్యాశాఖ ప్రతిపాదనలకు మరికొన్ని మార్పులు సూచించారు. విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా ఆయా మార్పులు చోటు చేసుకోనున్నాయి. పథకం కోసం సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందుకు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా అంగీకారం తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తమైన మధ్యాహ్న భోజన పథకాన్ని గాడిలో పెట్టేలా కూటమి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా తొలుత కలెక్టర్ ఆధ్వర్యంలో విద్యాశాఖ తల్లిదండ్రుల కమిటీలు, ఏజన్సీ నిర్వాహకులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలలు 4700 పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు దాదాపు 6.45 లక్షల మంది ఉన్నారు. అయితే ఇందులో దాదాపు 20 నుంచి 35 శాతం వరకు విద్యార్థులు వివిధ కారణాలతో మధ్యాహ్న భోజనం చేయడం లేదు. లావు బియ్యంతో వండిన అన్నాన్ని తినేందుకు విద్యార్థులు ఇష్టపడటం లేదని ఉపాధ్యాయులు గుర్తించారు. దీని గురించి అనేకసార్లు నిర్వాహకులు, ఉపాధ్యాయులు గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. విద్యాశాఖ కూడా నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందించినా పాలకులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభు త్వం అధికారం చేపట్టిన వెంటనే మధ్యాహ్న భోజనం పథకంపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజనంలో మార్పులకు సిద్ధమైంది. పాఠశాలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యకు భోజనం తీసుకునే విద్యార్థుల సంఖ్య కు మధ్య ఉన్న వ్యత్యాసాలు తొలగించ డానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఏజెన్సీలకు జనవరి నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

### మార్పులు ఇలా..

- మధ్యాహ్న భోజన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే బడ్జెట్ పెంచాలి. భోజనం కోసం సన్న బియ్యం ఇవ్వాలి.
- విద్యార్థులకు రోజువారీ మెనూలో అందించే చింతపండు పులిహోర బదులు లెమన్ రైస్. ఉదయం ఇచ్చే రాగి జావకు ప్రత్యామ్నాయంగా రాగులతో చేసిన చిక్కీలు, లడ్డూలు లేదా పాలు ఇవ్వాలి.
- మెనూలో ఒకరోజు ఇచ్చే పొంగలి మార్చాలి.
- వైట్‌రైస్, సాంబారు విడివిడిగా ఇవ్వాలి.
- ఉడకబెట్టిన కోడిగుడ్లు పెంకు తీయకుండా ఇవ్వాలి.
- ప్రతి శనివారం ఇచ్చే స్వీట్‌కు ప్రత్యామ్నాయం.





# రోప్‌వే.. పిల్లర్ల దశలోనే


- కోటప్పకొండలో నిలిచిపోయిన నిర్మాణం
- గత టీడీపీ హయాంలో శంకుస్థాపన
- నిధులు విడుదల చేయని గత వైసీపీ ప్రభుత్వం
- ఇటీవల చంద్రబాబుకు వినతి.. సాధ్యాసాధ్యాలపై అధ్యయనం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామిసన్నిధి పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంది. అయితే కొండకు అదనపు హంగుగా ఉండాల్సిన రోప్‌వే నిర్మాణంపై అనుమానాలు నెలకొన్నాయి. కోటప్పకొండ దిగువ నుంచి స్వామి సన్నిధికి గత టీడీపీ ప్రభుత్వ హయంలో రోప్‌వే నిర్మాణం మొదలైంది. అయితే వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. గత టీడీపీ హయాంలో రోప్‌వే నిర్మాణానికి నాటి శాసన సభాపతి డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు కృషి చేశారు. ఈ క్రమంలో రూ.6.82 కోట్లతో రోప్‌వే నిర్మాణ పనులకు ఆమోదం లభించింది. కొండ దిగువన ఉన్న పర్యాటక శాఖ ఉద్యానవనం నుంచి కొండ ఎగువన ఉన్న అతిథిగృహం పక్కన వరకు రోప్‌వే నిర్మించాలని నిర్ణయించారు. 400 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పున నిర్మాణం చేయాల్సి ఉంది. రోప్‌వే నిర్మాణంలో భాగంగా కొండ దిగువన ఉద్యానవనం స్థలంలో పిల్లర్లు కూడా నిర్మించారు. వైసీపీ హయాంలో పనులకు బిల్లులు చెల్లించలేదు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. గత ఐదేళ్ల రోప్‌వే నిర్మాణం ఊసే పర్యాటక శాఖ ఎత్తలేదు. ఇటీవల సీఎం చంద్రబాబు కోటప్పకొండను సందర్శించిన సమయంలో రోప్‌వే నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు కోరారు. రోప్‌వే నిర్మాణ సాధ్యా సాధ్యాలపై అధ్యయనం చేయాలని పర్యా టక శాఖ ఉన్నతాధికారులను సీఎం ఆదే శించారు. గతంలో ఉన్న కాంట్రాక్టర్‌ను పనులు ప్రారంభించాలని పర్యాటక శాఖ ఆదేశించింది. అయితే బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ సుముఖంగా లేరని తెలుస్తోంది. రోప్‌వే నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని భక్తులు, పర్యాటకులు కోరుతు న్నారు. కూటమి ప్రభుత్వం రోప్‌వేను నిర్మిస్తుందా.. నిలిపివేస్తుందా అన్న అంశం ఉన్నతాధికారులు రూపొందించే నివేదికపై ఆధారపడి ఉంది.

## ఆలపాటి నుంచి ఫోన్‌కాల్ రాలేదు

**ఎమ్మెల్యే నరేంద్రకుమార్ కార్యాలయ ప్రకటన**



గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ నుంచి పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌కు ఎలాంటి ఫోన్‌కాల్ రాలేదని ధూళిపాళ్ల కార్యాలయ సిబ్బంది ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలానే ఆలపాటి తమను సంప్రదించలేదని పేర్కొన్నారు. రెండు, మూడు రోజుల్లో సమావేశం జరుగుతుందనేది ఊహాజనితమని తెలిపారు.

# కూలికి వెళ్లొస్తూ.. కాటికి



గంగమ్మ



మాధవి



సామ్రాజ్యం



పద్మ



గుంతలో పడి ట్రాక్టర్ బోల్తా పడిన ప్రదేశం

**కాల్వలో ట్రాక్టర్ బోల్తాపడి నలుగురు మృతి**

- నాలుగు కుటుంబాల్లో అలుముకున్న విషాదం
- రోడ్డు ప్రమాదంపై రవాణా శాఖ మంత్రి విచారం
- మృతుల కుటుంబాలను ఆదుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ

ముప్పాళ్ల, సత్తెనపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కూలి పనులకు వెళ్లి కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. రోజులాగానే పనులకు వెళ్లి మిర్చి కోసి అదే టిక్కీలతో ట్రాక్టర్‌పై వస్తున్నారు. కబుర్లు చెప్పుకుంటూ వస్తున్న వారు.. వారు కూర్చొన్న టిక్కీల బస్తాలు, ట్రాక్టర్ ట్రక్కు కింద పడి ప్రాణాలు కోల్పోయారు. రోడ్డుపై గుంతలతో అదుపుతప్పిన ట్రాక్టర్ కాల్వలో బోల్తా పడటంతో నలుగురు మహిళా కూలీలు మృతి చెందారు. ఆదివారం సాయంత్రం ముప్పాళ్ల మండలం బొల్లవరం శివారు మాదల మేజరు కాల్వ వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చాగంటివారిపాలేనికి చెందిన కూలీలు నలుగురు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు.. ముప్పాళ్ల మండలం చాగంటివారిపాలేనికి చెందిన రైతు మువ్వా శ్రీకాంత్ బొల్లవరం గ్రామ శివారులో పొలం కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేస్తున్నారు. 21 మంది కూలీలు తీసుకెళ్లడం.. పొలం నుంచి టిక్కీలను తీసుకు వచ్చేలా గ్రామానికి చెం దిన పోపూరి చిన్న ట్రాక్టర్‌ను అద్దెకు కుదు ర్చుకున్నాడు. రోజులాగా ట్రాక్టర్‌లో కూలీలను ఎక్కించుకుని, మిర్చి టిక్కీలు వేసుకుని ఆది వారం సాయంత్రం గ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో మేజరు కాలువ గట్టు పక్కన రోడ్డు గుంతలమయంగా ఉండటంతో ట్రాక్టర్ అదుపు తప్పి పక్కనే ఉన్న కాల్వలో బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌లో మిర్చి టిక్కీ లపై కూర్చున్న కూలీలు కింద పడటంతో వారిపై మిర్చి టిక్కీలతో పాటు ట్రాక్టర్ ట్రాలీ పడింది. ఈ ప్రమాదంలో తేనేపల్లి పద్మ (46), మధిర సామ్రాజ్యం(55), మధిర గంగమ్మ(60) సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన చక్కెర మాధవి(30) సత్తెన పల్లి ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందింది. ట్రాక్టర్ పడబోతుందని గమనించిన కూలీలు కొంత మంది ట్రక్కుపై నుంచి దూకడంతో కొందరు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఎస్పీ శ్రీనివాసరావు, సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, సీఐ ఎంవీ సుబ్బారావు సందర్శించారు. తహసీల్దార్ భవానీశంకర్ సత్తెన పల్లి ఏరియా వైద్యశాలలో క్షతగాత్రులను, మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు సేకరించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ముప్పాళ్ల పోలీసులు కేసు నమోదు చేశారు.



### చాగంటివారిపాలెంలో విషాదం

రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన నలుగురు మృతి చెందడంతో చాగంటివారిపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రోజు తమతో పాటు కలసి మెలసి తిరుగుతూ కబుర్లు చెప్పే మహిళలు మృతి చెందడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేక పోతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని వ్యవసాయ కూలీల కుటుంబాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

### తల్లి అవయవాలు దానం చేస్తా ..

మృతి చెందిన తల్లి అవయవాలను దానం చేస్తానని పద్మావతి కుమారుడు సాయిలక్ష్మణాచారి ఏరియా వైద్యశాలలో విలేకర్లకు తెలిపారు. తాము, తమ సోదరి ఉన్నామని, సోదరికి వివాహం జరిగిందని, తండ్రి కార్పెంటర్‌గా పని చేస్తుంటారన్నారు. తల్లి కూలీ పనులకు వెళ్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటుందన్నారు. ప్రమాదంలో తల్లి మృతి చెందడం కుటుంబానికి తీరని లోటన్నారు.

### రోజూ ఉపాధి పనులకెళ్లేది..

మా అత్త మధిర గంగమ్మ రోజూ గ్రామంలో జరిగే ఉపాధి హామీ పనులకు వెళ్లేదని కోడలు రజిని తెలిపింది. తోటి గ్రామస్తులు మిర్చి కోతలకు వెళ్తుండటంతో వారితో కలిసి ఆదివారం వెళ్లిందన్నారు. రోజూలానే ఉపాధి పనులకు వెళ్లి ఉంటే ఆమె ప్రాణాలు దక్కేవన్నారు. కుటుంబానికి అండగా ఉండే అత్త మృతిపై ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. తమది పేద కుటుంబం అని ఆమె తెలిపింది.

### ప్రమాదంపై సీఎం చంద్రబాబు విచారం

గుంటూరు (ఆంధ్రజ్యోతి): బొల్లవరం శివారులో ట్రాక్టర్ బోల్తా పడి నలుగురు కూలీలు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విచారం వ్యక్తం చేశారు. పొలం పనులు ముగించుకుని ఇంటికి చేరుకునే సమయంలో ఇటువంటి దుర్ఘటన చోటు చేసుకోవడం అత్యంత బాధాకరమన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదంపై రవాణాశాఖ మంత్రి ఎం రామ్ ప్రసాదరెడ్డి కూడా విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనపై పల్నాడు ఎస్పీతో, ముప్పాళ్ల మండల అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

### ఎమ్మెల్యే కన్నా దిగ్భ్రాంతి

చాగంటివారిపాలేనికి చెందిన నలుగురు కూలీలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు.

# పొగాకు బోర్డు ఈడీగా విశ్వశ్రీ

● నాలుగేళ్లు డిప్యూటేషన్ కల్పిస్తూ కేంద్రం ఉత్తర్వులు



గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పొగాకు బోర్డు నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బి.విశ్వశ్రీ నియమితులయ్యారు. 2014 త్రిపుర రాష్ట్ర క్యాడర్‌కు చెందిన విశ్వశ్రీ ప్రస్తుతం ఆ రాష్ట్రంలో కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ డిపార్టుమెంట్‌కు డైరెక్టర్‌గా, టీఐడీసీ లిమిటెడ్ ఎండీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె కేంద్ర ప్రభుత్వానికి డిప్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా పొగాకు బోర్డు ఈడీగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించింది. ప్రస్తుత ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు డిప్యూటేషన్ వచ్చే నెల 11తో ముగియనుంది. శ్రీధర్‌బాబు 2017 నుంచి డిప్యూటేషన్‌పై టుబాకో బోర్డు ఈడీగా కొనసాగుతున్నారు.

## జాతీయ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



ఎంపికైన కుందన మైత్రి

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రం, లుధియానాలో మార్చి 17 నుంచి జరిగే జాతీయ స్కూల్ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు జిల్లాకు చెందిన కుందన మైత్రి ఎంపికైయ్యారు. ఈ నెల మొదటి వారంలో కర్నూలు జిల్లాలో జరిగిన అంతర్‌జిల్లా పోటీల్లో మైత్రి అత్యున్నత ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా కుందన మైత్రిని డీఎస్‌డీవో నరసింహారెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, కోచ్‌లు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

## నేటి నుంచి ఐఏ అండ్ ఏడీ సౌత్ జోన్ క్రికెట్ టోర్నీ

● పాల్గొననున్న ఏపీ, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, కేరళ జట్లు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఐఏ అండ్ ఏడీ సౌత్ జోన్ క్రికెట్ టోర్నీ జరుగనుంది. విజయవాడలోని ప్రిన్సిపల్ ఎకౌంటెంట్ జనరల్ (ఆడిట్) కార్యాలయం నేతృత్వంలో తొలిసారి సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంటు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు దక్షిణాది రాష్ట్రాల నుంచి ఏపీ, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ తొలిసారిగా ఈ పోటీలను నిర్వహిస్తోంది. ఆలిండియా క్రికెట్ టోర్నీకి అర్హత సాధించేందుకు ఈ పోటీలు ఉపకరిస్తాయని ఆడిట్ కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. టోర్నమెంటులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో వారి రాష్ట్రాల తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం కలుగుతుందన్నారు. క్రీడాకారులు, క్రికెట్ అభిమానులు మ్యాచ్‌లను తిలకించే అవకాశాలను కల్పించినట్టు నిర్వాహకులు తెలిపారు.

## నేడు జరగాల్సిన మద్యం షాపుల లాటరీ వాయిదా

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గౌడ సంఘీలకు నేడు నిర్వహించాల్సిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు గుంటూరు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి అరుణ కుమారి ఆదివారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తాత్కాలికంగా ఈ లాటరీ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని ఆమె పేర్కొన్నారు.

# కారుణ్య ఉద్యోగులపై కరుణ ఏదీ?

● కలెక్టరేట్ నుంచి సులభంగానే నియామక ఉత్తర్వులు
● సంబంధిత శాఖలకు వెళ్లిన తర్వాత పోస్టింగ్ కోసం పడిగాపులు
● అమ్యామ్యాల కోసమేనన్న అనుమానాలు

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులపై కొన్ని శాఖలు ఏమాత్రం కనికరం చూపడం లేదు. కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు రాగానే వెంటనే జాయినింగ్, పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వాల్సిన అధికారులు రోజులు, నెలల తరబడి జాప్యం చేస్తున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పేరుతో కార్యాలయాల చుట్టూ తిప్పించుకొంటున్నారు. అధికారులు చెప్పిన సమయానికి వెళ్లినా సర్టిఫికెట్లు పరిశీలన చేయకుండా తమకు బిజీగా ఉందనో, మీటింగ్‌కు వెళ్లాలనో చెప్పి తరచూ వాయిదాలు వేస్తున్నారు. దీంతో కారుణ్య నియామకాలు పొందిన అభ్యర్థులు విసిగి వేశారిపోతున్నారు. ఇలా జాప్యం చేయడానికి కారణం అమ్యామ్యాల కోసమేనన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

### నెలల తరబడి..

ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తూ చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు కారుణ్య నియామకం కింద ఒకరికి ఉద్యోగం ఇస్తారు. చనిపోయిన ఉద్యోగి శాఖలో ఖాళీ ఉంటే కుటుంబంలో సతీమణి, కుమారుడు, కుమార్తెలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తారు. ఒకవేళ ఖాళీలు లేకపోతే కలెక్టరేట్‌కి తమ డిపార్టుమెంట్‌లో ఖాళీ లేదనీ, వేరే ఏదైనా శాఖలో కారుణ్య నియామకం కల్పించాలని ప్రతిపాదన పంపుతారు. దీనికి దాదాపుగా 4 నుంచి ఆర్నెల్ల సమయం తీసుకొంటున్నారు. కలెక్టరేట్‌కు వచ్చాక విద్యార్హతలను బట్టి జూనియర్ అసిస్టెంట్, అటెండర్ తదితర ఉద్యోగాలను రోస్టర్ ప్రకారం చూసుకొని ఇవ్వాల్సి ఉంది. కొన్ని సందర్భాల్లో కలెక్టరేట్‌లోనూ రెండు నుంచి నాలుగు నెలల సమయం పడుతున్నది.

### నరకం చూపిస్తున్నారు

కలెక్టరేట్ నుంచి ఖాళీలున్న డిపార్టుమెంట్లకు ఎలాట్‌మెంట్ చేస్తూ ఆర్డర్స్ ఇస్తారు. ఇక ఆ తర్వాత అసలు కథ ప్రారంభమౌతుంది. కలెక్టరేట్‌లో నియామక ఉత్తర్వులు పొందేవరకు ఎలాంటి లంచాలు చెల్లించకుండానే ప్రక్రియ పూర్తి అవుతుంది. కలెక్టరేట్ నుంచి కేటాయించిన డిపార్టుమెంట్లకు వెళ్లిన తర్వాత ఉద్యోగంలో చేరబోయేది బాధిత కుటుంబానికి చెందిన వ్యక్తి, రేపటి రోజున తమతో పాటు కలిసి పని చేసేవాళ్లని కూడా చూడకుండా నరకం చూపిస్తున్నారు. కలెక్టరేట్ నుంచి ప్రొసీడింగ్స్ వెళ్లిన తర్వాత సీనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగి ఫైల్‌ని సంబంధిత డిపార్టుమెంట్ ఉన్నతాధికారికి పెట్టాలి. అయితే ఈ ఉద్యోగి ఫైల్‌ను వెంటనే పెట్టకుండా ముందు వెళ్లి అధికారిని కలవమంటున్నారు. అలా నెల జరిగిన తర్వాత మెల్లగా ఫార్మాలిటీస్ చిట్టా విప్పుతున్నారు. ఆ ఫార్మాలిటీస్ ముట్టజెబితేనే పోస్టింగ్ ఆర్డర్స్ ఇస్తున్నారు. లేకుంటే కాలయాపనే. ఈ నేపథ్యంలో అధికారులపై ఫిర్యాదు చేస్తే రేపటి రోజున తమను ఎక్కడ ఇబ్బంది పెడతారోనన్ని కారుణ్య నియామకం పొందిన వారు లోలోపలే కుమిలిపోతున్నారు.

# రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

● కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి

తాడేపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమౌతుందని కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆదివారం తాడేపల్లి మండలం కుంచనపల్లి అరవింద హైస్కూల్‌లో డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల రాష్ట్ర వ్యాప్త సమావేశం నిర్వహించారు. 2003 డీఎస్సీ టీచర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మోపిదేవి శివశంకరరావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డీఎస్సీ 2003 ఉపాధ్యాయులు ఈ సమావేశానికి హాజరైయ్యారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. శాసనమండలి విప్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ అర్హులైన ఉద్యోగ, ఉపాధ్యాయులు 11 వేల మందికి త్వరలో పాత పెన్షన్ వస్తుందని హామీ ఇచ్చారు. పాత పెన్షన్ కోసం గత 20 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. 2020లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57 ప్రకారం రాష్ట్రంలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, పోలీసు కానిస్టేబుళ్లు తదితర ఉద్యోగస్తుందరికీ కలిపి 11 వేల మందికి పాత పెన్షన్ ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే గత ప్రభుత్వం తీవ్రమైన ఆలస్యం చేయడం వలన నేటికీ పెన్షన్ ఫలితాన్ని పొందలేకపోయారన్నారు. ఈ సమస్యను త్వరలోనే సీఎం చంద్రబాబు పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, ఫోరం కన్వీనర్ గురుబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

### పాత పెన్షన్ సాధనకు పోరాడతాం : ఎమ్మెల్సీ లక్ష్మణరావు



ప్రసంగిస్తున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు

అర్హులైన ఉద్యోగ, ఉపాధ్యాయులు తదితరులకు పాత పెన్షన్ వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం కుంచనపల్లి అరవింద హైస్కూల్‌లో జరిగిన డీఎస్సీ 2003 ఉద్యోగ, ఉపాధ్యాయుల సమావేశానికి లక్ష్మణరావు హాజరై మాట్లాడుతూ 20ఏళ్లుగా పాత పెన్షన్ కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఎదురు చూస్తున్నాయనీ, నేటికీ అమలుకు నోచుకోలేదని చెప్పారు. వీరికి రావాల్సిన పాత పెన్షన్ పునరుద్ధరణకు కృషి చేస్తానని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు చెప్పారు. ఇదిలా ఉండగా ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ఒకే వేదికకు ఒకరి తరువాత ఒకరు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న నేతలు లక్ష్మణరావు, రాజేంద్రప్రసాద్ హాజరై ప్రసంగించడం కొసమెరుపు.

# పట్టభద్రుల ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించాలి



ఆలపాటిని అభినందిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గుంటూరులోని ఆలపాటి కార్యాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఆదివారం కలిసి, దుశ్శాలువాతో సత్కరించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ప్రతి ఓటరునూ పార్టీ శ్రేణులు నేరుగా కలవాలని, సోషల్ మీడియాను పెద్ద ఎత్తున వినియోగించుకోవాలని, పట్టణ ప్రాంతాల్లో ఉండే పట్టభద్రులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జగన్‌రెడ్డి పాలనలో అప్పుల ఊబిగా మారిన రాష్ట్రాన్ని కేవలం ఏడు నెలల్లోనే సీఎం చంద్రబాబు ఏ విధంగా అభివృద్ధి బాట పట్టిస్తున్నారో ఓటర్లకు వివరించాలన్నారు.

### ఆలపాటి విజయానికి కృషి చేయండి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు- కృష్ణా ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు విజయానికి కృషి చేయాలని రెవెల్యూషనరీ విద్యార్థి సంఘం(ఆర్ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ భవన్లో ప్రచార పత్రాలను ఆవిష్కరించి ప్రసంగించారు. విద్యా సంస్థలతో ఎంతో మంది యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు ఆలపాటి కల్పించారని గుర్తుచేశారు. సేవా దృక్పథం ఉన్న రాజేంద్ర ప్రసాదును మండలికి పంపేలా కృషి చేయాలన్నారు. ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో ఆలపాటి గెలుపునకు విస్తృత ప్రచారం చేయనున్నట్టు తెలిపారు. శ్రీధర్‌నాయుడు, మోహన్, వరప్రసాదు, నాయక్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# డీజిల్ దొంగిలిస్తున్న ముఠా అరెస్టు



ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పెదకాకాని సీఐ నారాయణస్వామి

పెదకాకాని, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీల నుంచి డీజిల్ దొంగిలిస్తున్న ముఠాని అరెస్టు చేసినట్లు పెదకాకాని సీఐ నారాయణస్వామి ఆదివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా అమరావతి మండలం మునుగోడు గ్రామానికి చెందిన సాధనాల విజయ్ బాబు, కొల్లికొండ వెంకటరావు, అబ్బినేని వెంకట నరసయ్య (నాని) ముగ్గురూ ఒక ముఠాగా ఏర్పడి దర్జాగా కారులో వచ్చి ఆటోనగర్, పెదకాకాని, తక్కెళ్ళపాడు ప్రాంతాలలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీలను గుర్తించి డీజిల్ కాజేస్తున్నారు. ఆటోనగర్ వద్ద ఆగి ఉన్న లారీలో డీజిల్‌ను దొంగిలిస్తున్న క్రమంలో వెంకట కోటిరెడ్డి అనే ఒక షాపు యజమాని ఫిర్యాదు చేయగా, నిందితులను అదుపులోకి తీసుకొని అక్రమంగా తీసిన డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ పేర్కొన్నారు.

### గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు అరెస్టు

పెదకాకాని, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు పెదకాకాని సీఐ నారాయణస్వామి ఆదివారం తెలిపారు. మంగళగిరి రూరల్ మండలం కాజా గ్రామానికి చెందిన గంజిబోయిన శశాంక్, మంగళగిరి పట్టణానికి చెందిన పెరుగు అనిల్ కుమార్ ఇద్దరూ విశాఖపట్నంలోని అర్జున్ అనే వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి మంగళగిరి తీసుకొస్తున్నారు. వాటిని చిన్న చిన్న పాలిథిన్ ప్యాకెట్‌లో పెట్టి చుట్టుపక్కల గ్రామాలైన కాజా, మంగళగిరి , పెదకాకాని, ఉప్పలపాడులో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో పెదకాకాని సమీపంలోని జీపీఆర్ గార్డెన్ వద్ద ఇద్దరు నిందితులు మూడు కేజీల గంజాయితో ఉన్నట్లు సీఐ నారాయణస్వామికి వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద గంజాయిని స్వాధీన పరుచుకుని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ చెప్పారు.

## సాయి సాధన బాధితుల్ని ఆదుకోవాలి

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సాయి సాధన చిట్‌ఫండ్ బాధితులు కమ్మ బాలుర వసతి గృహంలో ఆదివారం సమావేశం అయ్యారు. ఇటీవల సాయి సాధన చిట్‌ఫండ్ అధినేత పాలడుగు పుల్లారావు గుంటూరు కోర్టులో లొంగిపోవడంతో న్యాయస్థానం రిమాండ్ విధించిన విషయం విదితమే. ఈ సందర్భంగా సమావేశంలో పలువురు బాధితులు తమ ఆందోళన, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సుమారు రూ.200 కోట్లు మోసం జరిగిందని బాధితులు చెబుతున్నారు. ఎంతమంది బాధితులు ఉన్నారో, ఎంతమేర నగదు రావాలో జాబితా తయారు చేస్తున్నారు. బాధితులందరూ ఐక్యంగా పోరాడితేనే న్యాయం జరుగుతుందని సమావేశం నిర్ణయించింది. సమావేశం అనంతరం పట్టణంలో మోటర్ బైక్ ర్యాలీ నిర్వహించారు. గుంటూరు రోడ్డులోని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆస్పత్రి వద్ద రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేకు పరిస్థితిని వివరించారు. న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

# ఎన్డీఏపై నమ్మకం పెరుగుతోంది

● అసెంబ్లీ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఎన్డీఏ డబుల్ ఇంజన్ సర్కార్‌పై రోజురోజుకూ ప్రజల్లో నమ్మకం పెరుగుతుందనీ, ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనమే దానికి నిలువెత్తు నిదర్శనమని రాష్ట్ర అసెంబ్లీ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. బీజేపీ వినుకొండ పట్టణ అధ్యక్షుడిగా కోట వెంకట సుధాకర్ నియమితులైన సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. సుధాకర్‌ను జీవీ, మక్కెన దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం చీఫ్‌విప్ జీవీ మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతుల్లో రాష్ట్రం సురక్షితంగా ఉందని, అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. అమరావతి, పోలవరం, హైవేలకు నిధులు మంజూరు చేయడంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయింపులు జరిగాయన్నారు. బలమైన లక్ష్యం కోసం బలమైన నాయకత్వం అవసరమని, అది ఎన్డీఏతోనే సాధ్యమన్నారు.

# కత్తితో కొట్టి.. పీక కోసి..

● మహిళ దారుణ హత్య ● ఆస్తి, కుటుంబ కలహాలే కారణం



పసుపులేటి సరస్వతి (ఫైల్)

రేపల్లె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కత్తితో కొట్టి.. పీక కోసి మహిళను దారుణ హత్య చేసిన సంఘటన పట్టణంలోని మునుసుబువారిపాలెం 3వవార్డులో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మునుసుబువారిపాలెం 3వవార్డుకు చెందిన పసుపులేటి సరస్వతి (68) స్వగృహంలో శనివారం రాత్రి నిద్రపోయారు. ఆదివారం ఉదయం 8 గంటలైనా తలుపులు తియ్యకపోవటంతో చుట్టుపక్కల వారు తలుపులు నెట్టి చూశారు. సరస్వతి హత్యకు గురైందని తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వచ్చిన పట్టణ సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ సరస్వతిని కత్తితో కొట్టి పీక కోశారని తెలిపారు. ఆస్తి, కుటుంబ కలహాల నేపథ్యంలో హత్య జరిగి ఉండవచ్చని అన్నారు. ఆదివారం తెల్లవారుజామున హత్య చేసి ఉంటారని తెలిపారు. డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, ఎస్ఐ రాజశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాపట్ల నుంచి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి భర్త మొదటి సంబంధానికి కుమారుడు కృష్ణారావు ఉన్నారు. వీరి మధ్య ఆస్తి, కుటుంబ కలహాల నేపథ్యంలో హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి చిన్న కుమార్తె తులసి ఉషారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

## చిన్నారిపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్టు

కొల్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తన ఇంటి సమీపంలో ఆడుకుంటున్న ఏడేళ్ల చిన్నారితో ఓ యాభై ఏళ్ల వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ ఏడుకొండలు తెలిపిన ప్రకారం... కొల్లూరులో గత నెల 29న ఇంటి వద్ద ఉన్న నిందితుడు ఊదరగుడి లక్ష్మయ్యకు కొద్ది దూరంలో ఆడుకుంటూ చిన్నారి కనిపించింది. మాయమాటలు చెప్పి తన ఇంటిలోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. భయంతో ఆ బాలిక తప్పించుకుని బయట పడింది. ఈ నెల 5న మేనత్త ఇంటి ముందున్న ఆ బాలికకు నిందితుడు రోడ్డుపై కనిపించడంతో భయపడి మేనత్త ఇంట్లోకి పరుగు తీసింది. ఈ విషయమై ఆమె ప్రశ్నించడంతో బాలిక జరిగిన విషయాన్ని చెప్పింది. ఆమె ద్వారా విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు, బంధువులు శనివారం పోలీసులను ఆశ్రయించారు. నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆదివారం మొసలిపాడు వద్ద అతడిని అదుపులోకి తీసుకున్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



అజయ్ (ఫైల్)

రెంటచింతల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా చికెన్ విక్రయించే దుకాణాల సమీపంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం వేకువజామున జరిగింది. ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాల మేరకు.. ఆనందపేటకు చెందిన అన్నదమ్ములైన అనుముల అజయ్(26), నవీన్‌లు ప్రధాన రహదారిలో ఉన్న చేవూరి శ్రీనివాసరావు కిరాణ దుకాణంలో పనిచేస్తున్నారు. అదే దుకాణంపైన ఓ గదిలో అవివాహితుడైన అజయ్ అద్దెకుంటున్నాడు. శనివారం రాత్రి మద్యం తాగిన అజయ్ ఆదివారం తెల్లవారుజామున కిందకు దిగే క్రమంలో డాబా పైనుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తలకు తీవ్రగాయం కావడంతో ప్రాణాలొదిలాడు. గురజాల డీఎస్పీ బీఎల్ఎన్ జగదీష్, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ నాగార్జున సంఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. మృతుని తండ్రి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై విచారించేందుకు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు వచ్చారు. మృతదేహాన్ని పరిశీలించి మృతికి గల కారణాలనుడీఎస్పీ జగదీష్‌ను అడిగి తెలుసుకున్నారు. డాగ్ స్క్వాడ్ వచ్చింది. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నాగార్జున తెలిపారు.

### సెల్‌ఫోన్ కాల్ లిస్టుపై పోలీసుల ఆరా

మృతి చెందిన అజయ్ సెల్‌ఫోన్ ద్వారా ఎవరెవరికి ఫోన్ చేశారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అజయ్ గదిలో ఎంతమంది కూర్చుని మద్యం తాగారు, వాళ్లు ఎక్కడివారు, ఏం మాట్లాడుకున్నారనే దానిపై పోలీసులు కూపీ లాగుతున్నారు. చివరిసారిగా ఎవరికి ఫోన్ చేశాడు అనే దానిపై దృష్టి పెట్టినట్లు సమాచారం.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 113,121,132 |
| చికెన్ విత్ స్కిన్ | 216.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 226.00 |

## ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు గ్రీవెన్స్‌కు బ్రేక్

గుంటూరు, ఫిబ్రవరి 9, (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో నేడు పోలీస్ కార్యాలయంలో జరగాల్సిన ఎన్నికల కోడ్‌ను తాత్కాలికంగా రద్దు చేసినటు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఎస్పీ గ్రీవెన్స్ ఉండదన్నారు. పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదులు ఇవ్వాలనుకునే వారు ఈ విషయాన్ని గమనించాలని, సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయం వరకు వచ్చి ఇబ్బంది పడొద్దని తెలిపారు. పోలీస్ పరమైన ఇబ్బందులు ఏమైనా ఉంటే వారు స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.



## నాసా ప్రాజెక్టుకు అర్హత సాధించిన 'నారాయణ' విద్యార్థులు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డులోని నారాయణ పాఠశాల విద్యార్థులు నాసా ప్రాజెక్టుకు అర్హత సాధించారని ఏజీఎం జానకిరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులు ఏ నర్మద, డీ రిత్విక్, సీహెచ్ లక్ష్మీశైలజ, బీ రోహిణి, ఎం యశ్విన్ తదితరులు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం ఎం.రమేష్‌కుమార్, విజయ్ బాబు, వెంకటేశ్వరరావు అభినందించారు.

## సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజును ప్రభుత్వ సెలవుగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట రమణ నాయక్ కోరారు. స్థానిక చుట్టుగుంటలో ఆదివారం బంజారా సేవా సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న జరిగే సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించాలని కోరారు. తమ హక్కులు సాధించుకునేందుకు బంజారాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరారు. బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసి, చిరు వ్యాపారులకు ఆర్థిక తోడ్పాటు అందించాలన్నారు. నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు, ఈ సమావేశంలో జాతీయ నాయకుడు లక్ష్మానాయక్, రాష్ట్ర కార్యదర్శి చక్రి నాయక్, సభ్యులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా హిందీ ప్రచార సభ పరీక్షలు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో పరిచయ, ప్రాథమిక, మాధ్యమ పరీక్షలు ఆదివారం స్థానిక సీతారామ్‌నగర్(మంగళగిరి రోడ్డు) లోని శ్రీ సరస్వతీ కమిటీ ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ స్కూల్లో జరిగాయి. ఆయా పరీక్షలకు మొత్తం 56 మంది విద్యార్థినీవిద్యార్థులు హాజరైనట్లు పాఠశాల కార్యదర్శి డీవీ సుబ్బారావు తెలిపారు. పరీక్షలకు సూపరింటెండెంట్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మానసవీణ, ఉపాధ్యాయులు అరుణకుమారి, నాగమేరి, విజయలక్ష్మి ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారని తెలిపారు.

## వీల్ లాకింగ్ సిస్టంతో ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఉక్కు పాదం

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ట్రాఫిక్ నిబంధనల అమలులో భాగంగా వీల్ లాకింగ్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఈ మేరకు ఆదివారం ఈస్ట్, వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు రద్దీ రోడ్లపై నిలిపిన వాహనాలకు వీల్ లాకింగ్ సిస్టమ్‌ను అమలు చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి, పార్కింగ్ చేయకూడని చోట నిలిపిన కార్లకు వీల్ లాకింగ్ సిస్టమ్ ప్రయోగించి, అపరాధ రుసుం విధించారు. వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య ఆధ్వర్యంలో 8 కార్లకు వీల్ లాకింగ్ సిస్టమ్ ప్రయోగించి, రూ.8,280 అపరాధ రుసుమును విధించారు. ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో కూడా 8 కార్లకు వీల్ లాకింగ్ సిస్టమ్ ప్రయోగించి అపరాధ రుసుం విధించారు. వ్యాపార సముదాయాలవారు, షాపింగ్ మాల్స్ వారు తప్పనిసరిగా తమకు సంబంధించి ఒక పార్కింగ్ స్థలాన్ని కేటాయించుకోవాలని, లేనిపక్షంలో ఎవరి షాప్ ముందు అయితే వాహనాలు నిలిపి ఉంటాయో ఆ షాపుల వారిపై కూడా చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామని టారఫిక్ సీఐలు అశోక్‌కుమార్, సింగయ్య హెచ్చరించారు.



స్తంభాలగరువులోని దివ్య బాలయేసు దేవాలయంలో పూజ చేస్తున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య

## అద్భుత బాల యేసు దేవాలయ వార్షికోత్సవం

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక స్తంభాల గరువు లోని అద్భుత బాల యేసు దేవాలయ వార్షికోత్సవాన్ని ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు, పెద్ద సంఖ్యలో గురువులు, సిస్టర్స్ మధ్య విచారణ గురువు ఎవరండీ పుట్టి సుందరరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలి పూజకు బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య హాజరై దైవ సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా బిషప్ సందేశమిస్తూ అద్భుత బాల యేసుగా కొలువైన ఈ ఆలయంలో క్రీస్తు ఎన్నో అద్భుతాలు చేశారన్నారు. ప్రతి ఒక్కరు దేవునిపై విశ్వాసాన్ని పటిష్ఠపరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నతనం నుంచే పిల్లలు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, ఇందుకు తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. దివ్య బాల యేసు దేవాలయంలో నూతనంగా నిర్మించిన నిత్య ధ్యాన మందిరం, షెల్టర్ హోమ్‌ను భాగ్యయ్య ప్రారంభించారు



హనుమాన్‌నగర్ వద్ద కోసుకుని పోయి ప్రమాదకరంగా ఉన్న రోడ్డు , భారత్ పెట్రోల్ బంక్‌కు ఎదురు రోడ్డు, శివరామ్‌నగర్ వద్ద ప్రధాన రోడ్డుపై గుంతలు

# ప్రధాన రోడ్లపై గుంతలు! ఏవీ మరమ్మతులు?

● శ్రీరామ్‌నగర్-చుట్టుగుంట వరకూ అధ్వానం
● ప్రమాదంలో వాహనచోదకులు

ఏటీ అగ్రహారం(గుంటూరు విద్య),ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక గుంటూరు - నరసరావుపేట రోడ్డులోని శ్రీరామ్‌నగర్ బస్టాప్ నుంచి చుట్టు గుంటకు వచ్చే మార్గంలో పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం వేల వాహనాలు తిరిగే ఈ మార్గంలో గుంతల కారణంగా వాహనచోదకులు ప్రమాదాలబారిన పడే పరిస్థితి. అయినప్పటికీ సంబంధిత శాఖాధికారులు తగు చర్యలు చేపట్టడం లేదు. రోడ్డు పక్కగా ఉన్న శివరామ్‌నగర్, హనుమాన్‌నగర్ కాలనీలకు ఏడాది క్రితం నూతన పైపు లైన్లు వేశారు. మెయిన్ రోడ్డులో ఉన్న ప్రధాన పైపులైన్ నుంచి కనెక్షన్ కోసం రోడ్డు మధ్యలో భారీగా తవ్వారు. ఆ తర్వాత దీనికి మరమ్మతులు చేయలేదు. గ్రావెల్, కంకర పోసి వదిలి వేయడంతో ప్రమాదకరంగా మారింది. శ్రీరామ్‌నగర్ నుంచి చుట్టగుంట వరకు దాదాపు ఆరు చోట్ల రోడ్డుపై గుంతలు ఉన్నాయి. వాహనచోదకులు ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా ప్రమాదాలు జరగడం ఖాయం. కొన్ని సందర్భాలలో వెనుక నుంచి వచ్చే వాహనాలు ఢీ కొడుతున్నాయి. ఇప్పటికైనా గుంతల పడ్డ రోడ్లకు మరమ్మతులు చేయాలని వాహన చోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు. నగరంలో చాలా చోట్ల అధ్వానపు రోడ్లకు మరమ్మతులు చేస్తున్నప్పటికీ వీటి గురించి పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

## చేపలు, మాంసం అనధికారికంగా విక్రయిస్తే చర్యలు



రింగ్ రోడ్డులో అనధికారికంగా చేపలు విక్రయిస్తున్న వారిని పంపించి వేస్తున్న శానిటరీ సూపర్‌వైజర్ సోమశేఖర్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం దృష్ట్యా నగరంలో చేపలు, మాంసం అనధికారికంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ స్థానిక మణిపురం బ్రిడ్జి కింద చేపల మార్కెట్, నల్లపాడు రోడ్డు, రెడ్డి కాలేజీ రోడ్డు, మిర్చి యార్డు, నవభారతనగర్, గోరంట్ల, ఆర్‌టీఓ ఆఫీసు, గుజ్జనగుండ్ల, అమరావతి రోడ్డు, పొన్నూరు రోడ్డు, పట్టాభిపురం ప్రాంతాల్లోని రోడ్లపై అనధికారికంగా చేపలు, మాంసం విక్రయిస్తున్న వారిని గుర్తించి దాడులు నిర్వహించామని, వాటిని తొలగించినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి అపరాధ రుసుం వసూలు చేశా మన్నారు. నగర పరిధిలో ఎక్కడైనా అనధికారికంగా నాటుకోళ్ళు, చేపలు, మాంసం విక్రయాలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. అపరాధ రుసుం విధించడమే కాక చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలుచేపడతామని హెచ్చరించారు. ప్రతి వారం నగర పాలక సంస్థ ప్రజారోగ్యాధికారులు బృందాలుగా ఏర్పడి దాడులు నిర్వ హిస్తున్నట్లు చెప్పారు. నగరంలో మాంసం విక్రయాలు జరిపే యజమానులు సంబంధిత డాక్యుమెంట్స్ అందజేసి డీఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్స్ పొంది వ్యాపారం నిర్వహించు కోవాలని, లైసెన్స్ లేని వారి షాపులను సీజ్ చేస్తామని తెలిపారు. శుభ్రత పాటించని షాపుల పై ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ యం.హెచ్.ఓ డాక్టర్ రవిబాబు, వెటర్నరి డాక్టర్ వెంకటేశ్వర్లు, శానిటరీ సూపర్‌వైజరు(ఎస్‌ఎస్)లు ఆనందకుమార్, సోమశేఖర్, రాంబాబు, అయుబ్ ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



ప్రవచనం చేస్తున్న డాక్టర్ గరికపాటి నరసింహారావు, హాజరైన భక్తులు

## నేర్చుకున్న విద్యను ఆచరించడమే గురువుకు నిజమైన దక్షిణ

● పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తాను ఏ గురువు దగ్గర విద్యలను అభ్యసిస్తాడో వాటిని ఆచరించినప్పుడే ఆ గురువుకు ఇచ్చే నిజమైన దక్షిణ అని మహా సహస్రావధాని పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. స్థానిక పట్టాభిపురం లోని శ్రీ రమాసత్యనారాయణ స్వామి దేవాలయ ప్రాంగణంలో 48వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం 'మహాభారత యుద్ధంలో భగవానుని పాత్ర' అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. నరసింహారావు ప్రవచనం చేస్తూ మొదటి పదిరోజులు భీష్మాచార్యుడు కురుక్షేత్ర యుద్ధాన్ని నిర్వహించారని దాని వలన కౌరవులకు ఏమి లాభం జరగలేదన్నారు. దుర్యోధనుడు భీష్ముని కన్న ముందుగా యుద్ధానికి సర్వసైన్యాధ్యక్షుడిగా కర్ణుడిని పెట్టిన యుద్ధం ఇన్నిరోజులు సాగేది కాదని నిష్ఠలాడారన్నారు. తొలుత అభిమన్యుని యుద్ధానికి పంపడానికి విముఖత చూపిన ధర్మరాజు పరిస్థితుల ప్రభావంతో పంపవలసివచ్చిందన్నారు. తిరుపతి వేంకట కవులు మహాభారత కథను నాటక రూపంలో రచించి భారత కావ్య విశిష్టతను లోకానికి తెలియజేసిన మహాకవులన్నారు. ఏ ప్రవచనం వినడానికి వెళ్లిన అందులోని మంచిని మాత్రమే స్వీకరించి, ఆచరించాలన్నారు. కార్యక్రమాన్ని ఆలయకమిటి సభ్యులు పర్యవేక్షించారు.



శ్రీ గౌరీవిశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో, ఓంకారక్షేత్రంలో స్వామివార్ల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు, పాల్గొన్న దంపతులు

## వైభవంగా స్వామివారి కల్యాణం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేటలోని శ్రీ గౌరీవిశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారి జన్మ నక్షత్రం సందర్భంగా కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించారు. అనంతరం దంపతులతో అర్చకస్వామి గౌరి విశ్వేశ్వర శర్మ కల్యాణం నిర్వహించారు. కార్య క్రమాన్ని ఆలయ అర్చకులు జంధ్యాల సుబ్ర హ్మణ్యశాస్త్రి, పవన్ కుమార్ శర్మ, చక్రపాణీ, గిరి పర్యవేక్షించారు.

## శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు

స్థానిక బ్రాడీపేటలోని ఓంకారక్షేత్రంలో శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం క్షేత్ర పాలక ఆంజనేయస్వామి వారికి, నవగ్రహ దేవతలకు వేదోక్తంగా అభిషేకార్చనలు నిర్వహించారు. గోదాదేవి సమేత రంగనాయక స్వామి, సువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణాలు కనుల పండువగా నిర్వహించారు. శ్రీమద్రామాయణం ప్రవచనాల్లో భాగంగా యుద్ధకాండలో అనేక విషయాలను మంచికంటి వెంకట సత్యవతి వివరించారు. ఉత్సవాలను ఆలయ కార్యదర్శి నంబూరు వేంకట శ్రీమన్నారాయణమూర్తి పర్యవేక్షించారు.



కళా ఉత్సవంలో పాల్గొన్న చిన్నారులతో మలినేని పెరుమాళ్ళు, నిర్వాహకులు

## ఘనంగా జాతీయస్థాయి నృత్య సంగీత- కళా ఉత్సవం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శ్రీ మంజునాథ నాట్య క్షేత్రం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి నృత్య సంగీత-కళా ఉత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మలినేని కాలేజీ ఛైర్మన్ మలినేని పెరుమాళ్ళు హాజరై ప్రసంగించారు. మన సంస్కృతీసంప్రదాయాలను తెలియజేసే నృత్యాలే మన భారతీయమని, కళ జీవించాలంటే అందరి ప్రోత్సాహం అవసరమని అన్నారు. అనంతరం సంస్కృతీసంప్రదాయాలకు అనుగుణంగా నృత్య ప్రదర్శనలు చేసిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు సుబ్రహ్మణ్యం, టి పవన్ కుమార్, జంపని కిషోర్ బాబు, డి.నాగమల్లేశ్వరి, విజయ మాధవి, డాక్టర్ ఆకుల శివప్రసాదు, ఎస్ అనిత పాల్గొన్నారు.

## కాలేజీ రోజుల అనుభూతి మాటలకు అందనిది

● జీసీకేవీఎన్ డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఎమ్మెల్యే నసీర్



సావనీర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వెలకట్టలేని అమ్మ ప్రేమను, విద్య నేర్పిన చదువులమ్మ గుడిని జీవితంలో ఎన్నటికీ మర్చిపోకూడదని, తరగతి గదులతో ముడిపడి ఉన్న అనుబంధాలను ఇరవై ఐదేళ్ల తర్వాత గుర్తుచేసుకుంటుంటే కలిగే అను భూతి మాటలకు అందనిదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ (జీసీకేవీఎన్) డిగ్రీ కళాశాలలో ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ 25 ఏళ్ల తర్వాత కూడా తాము చదువుకున్న విద్యాలయంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తరగతి గదుల్లో చెప్పే ప్రతిపాఠం జీవి తాలను శిల్పంగా మార్చే ఒక ఆయుధమని, దీనిని సద్వినియోగం చేసుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని సూచించారు. కాలేజీ విద్యార్థిగా, ఇదే కాలేజీకిసేవ చేయా లనే సంకల్పంతో ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న శ్రీనివాసరావు, సెక్రటరీ, అండ్ సెక్రటరీ రామకృష్ణ ప్రభుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కర్పూ రపు రామకృష్ణ ప్రభు, కళాపీఠం అధ్యక్షుడు ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, కమిటీ సభ్యుడు కర్పూరపు సూర్యనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఈరంటి వరప్రసాద్, కార్పొరేటర్ సంకూరి శ్రీను, బాపూజీ కమిటీ అధ్యక్షులు సాధు శివశంకర రావు, కళాశాల అధ్యక్షుడు పచ్చిపులుసు రాఘవరావు, మాజేటి ప్రసాద్, గుంటూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇంటర్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు

● జిల్లా వ్యాప్తంగా 119 కేంద్రాలు



ప్రయోగ పరీక్షలకు హాజరైన విద్యార్థులు (ఫైల్)

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు నేటి నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా మొత్తం 119 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఇంటర్ బోర్డు ఆర్‌ఐఓ జీకే జుబేర్ వెల్లడించారు. నిర్దేశించిన పరీక్షా కేంద్రాల్లో ల్యాబ్ పరికరాలు, రసాయనాలు, ఇతర మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు అసరమైన పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షలకు మొత్తం 26,308 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షల కోసం ఇప్పటికే పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటికే వృత్తి విద్యాకోర్సులు చదువుతున్న ప్రథమ,ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 5 నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభమయ్యాయి.వృత్తికోర్సులకు సంబంధించి మొదటి సంత్సరం 1215 మంది, ద్వితీయ సంవత్సరం 867 మంది పరీక్షలు హాజరు కానున్నారు.

## నోటి పరిశుభ్రతకు ప్రాముఖ్యతనివ్వాలి

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ ఉదయం, రాత్రి దంతధావనంచేసి నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేనిపక్షంలో నోటి దుర్వాసన, దంతక్షయం, చిగుళ్ల సమస్యలు ఏర్పడతాయని దంత వైద్యనిపుణుడు చల్లా చైతన్య తెలిపారు. ఆదివారం బ్రాడీపేటలోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ భవన్‌లో జరిగిన ఉచిత దంత వైద్యశిబిరంలో ఆయన ప్రసంగించారు. నోటిని పరిశుభ్రంగా ఉంచుకోకపోతే అనేక రకాల సూక్ష్మజీవులు నోటిలో ఆవాసం ఏర్పర్చుకొని చిగుళ్లవాపు, దంతాలు ఊడిపోవడం వంటి సమస్యలు కలిగిస్తాయని డాక్టర్ చైతన్య తెలిపారు. బీడీ, సిగరెట్, గుట్కా, మద్యం, ఖైనీ, వక్కపొడి వంటివి వాడే వారిలో పెదాలు, దవడల సమస్యలతో పాటు దంతక్షయం జరుగుతుందన్నారు. అనంతరం పరీక్షలు నిర్వహించి తగినసలహాలు అందించారు.

## పెన్షనర్‌కు ఫ్యామిలీ ఉంటే నామినీగా ఇతరులకు వీలులేదు

గుంటూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పెన్షనర్‌కు ఫ్యామిలీ ఉండగా వాళ్ళ ఫ్యామిలీ మెంబర్స్ కాకుండా ఇతరులను నామినీగా నియమించరాదని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చా వేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య తెలిపారు. రూల్ - 49 ప్రకారం నామినేషన్ దాఖలు చేసిన తరువాత ఉద్యోగి కంటే ముందే నామినీగా మరణించినా లేక ఉద్యోగి తరువాత రిటైర్‌మెంట్ గ్రాట్యూటీ పొందకనే మరణించినా ,ఇతర వ్యక్తికి గ్రాట్యువిటీ చెల్లించవచ్చన్నారు. నామినేషన్ ఇచ్చే సందర్భంలో ఉద్యోగికి ఫ్యామిలలీ లేకపోతే ఎవరైనా నామినీగా పేర్కొన్న సందర్భంలో రిటైర్డ్ అయిన తరువాత అతనికి ఫ్యామిలీ ఏర్పడితే కొత్తగా ఫ్యామిలీ మెంబర్ చేరితే అప్పుడు అతని పాత నామినేషన్ రద్దవుతుందన్నారు. తన మొదటి నామినేషన్ రద్దు చేయాలని పెన్షన్ మంజూరు అధికారికి నోటీసు పంపితే నోటీసు అధికారికి అందిన రోజు నుంచి మొదటి నామినేషన్ రద్దయి అతను సమర్పించిన కొత్త నామినేషన్ అమల్లోకి వస్తుందన్నారు. లేక నామినీ చనిపోతే కూడా రూల్ - 49 ప్రకారం నామినేషన్ రద్దవుతుందన్నారు. రిటైర్‌మెంట్ గ్రాట్యువిటీ ఉద్యోగికి చెల్లిస్తారన్నారు. అతడు దానిని తీసుకోకుండా మరణిస్తే అతను నామినేషన్‌లో తెలిపిన విధంగా చెల్లిస్తారన్నారు. నామినేషన్ సమర్పించకుండానే మరణిస్తే అతనికి రిటైర్‌మెంట్ గ్రాట్యువిటీ , ఇతర బెనిఫిట్స్ భార్య, భర్త / భార్యలు / కుమారులు / కుమార్తెలు వీరికి సమాన షేర్లలో చెల్లిస్తారన్నారు. రిటైర్ అయిన వ్యక్తికి ఎవరూ లేకపోతే 18 సంవత్సరాలలోపు ఉన్న తమ్ముడికి చెల్లిస్తారన్నారు. మొదటి భార్య బతికుండగా ప్రభుత్వ అనుమతి లేకుండా రెండో భార్యను పెళ్ళాడితే రిటైర్‌మెంట్ గ్రాట్యూటీ రెండో భార్యకు ఇవ్వడం కుదరదని వీరయ్య తెలిపారు.

## ముగిసిన నాటకోత్సవాలు



'సారీ...రాంగ్ నెంబరు' నాటికలో ఓ సన్నివేశం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ కాసరనేని సదాశివరావు కళా సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న 13వ నాటకోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కేఆర్‌కే ఈవెంట్స్ నిర్వ హణలో ఈ నాటకోత్స వాలు నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరు నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎల్‌వీఆర్ క్రియేషన్స్ -గుంటూరు, బత్తినేని సుభాష్ రచన-దర్శకత్వం వహించిన 'హాస్యవల్లరి'ని, హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ఏలూరు వారు చింతల మల్లేశ్వరరావు రచనకు మహమ్మద్ ఖాజావలి దర్శకత్వం వహించిన 'సారీ... రాంగ్ నెంబర్', కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ గుంటూరు వారు బొమ్మిడి రామకృష్ణ రచన, దర్శకత్వం వహించిన 'తర మెల్లిపోతున్నదో' నాటికలను ప్రదర్శించారు. ఆయా నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్, పాల్గొన్న వైద్యులు, ప్రముఖులు

## నగరాభివృద్ధిలో భాగస్వాములమవుదాం

● గుంటూరు నగర సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక
● స్వచ్ఛంద సంస్థల సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్ర వరి 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను క్షేత్ర స్థాయి నుంచి పరిష్కరించి, నగర అభివృద్ధికి సంపూర్ణ ప్రణాళికలను శ్రీకారం చుట్టబోతున్నామని కేంద్ర గ్రామీ ణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. నగరాభివృద్ధి నిమిత్తం స్థానిక భారతీయ విద్యా భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సంస్థల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ నగరాన్ని స్మార్ట్ సిటీగా రూపొందించేందుకు ప్రతిఒక్కరి సలహాలు, సూచనలు అవసరమన్నారు. గుంటూరులోని పార్కులు, ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల వసతి గృహాలను స్వచ్ఛంద సేవా సంస్థలు, కార్పొరేట్ సంస్థలు దత్తత తీసుకొని వాటి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం సహకారంతో నగరంలో మూడు ఫ్లైఓవర్ నిర్మాణానికి అనుమతులు పొందామని, తదుపరి ఆర్థిక సంవత్సరంలో శ్యామలానగర్ రైల్వే వంతెనను చేపట నున్నట్లు చెప్పారు. గుంటూరులోని ప్రభుత్వ సమగ్ర వైద్యశాలను కార్పొరేట్ ఆసుపత్రులతో సమానంగా తీర్చదిద్దనున్నామని, అన్ని రంగాల్లో నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు రెడ్ క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్ వంటి స్వచ్ఛంద సేవా సంస్థల సహకారం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన భారతీయ విద్యా భవన్ కార్యదర్శి పీ రామచంద్రరాజు, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ డాక్టర్ రవి వడ్లమాని, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ ఎస్‌ఎస్‌వీ, సాహితీ సమాఖ్య కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థల అధినేత మట్టుపల్లి మోహన్, ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఆవుల శ్రీనివాస్, గుంటూరు సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు నూతలపాటి తిరుపతయ్య, ప్రముఖ వైద్యులు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.



మార్కెటింగ్ శాఖాధికారులతో తన నివాసంలో సమావేశమైన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

## మిర్చి ధరలు తగ్గకుండా చర్యలు చేపట్టాలి

● నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆదేశాలు

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమి టీలో మిర్చి ధరలు తగ్గ కుండా అవసరమైన చర్యలు చేపట్టాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మార్కె టింగ్ అధికారులను ఆదేశించారు. గుంటూరులోని తన నివాసంలో ఆదివారం మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్లు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, మిర్చియార్డు సెక్రెటరీ చంద్రికతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మిర్చియార్డులో వివిధ రకాల మిరపకాయలకు లభిస్తున్న ధరలపై ఆరా తీశారు. ప్రస్తుత సీజన్‌లో మిర్చి ధరలు తగ్గడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్స్‌పోర్టులు, స్థానిక కొనుగోళ్లు పెరిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కమీషన్, ఎగుమతి వ్యాపారులతో సమావేశం నిర్వహించి ధర పెరిగేందుకు మార్గాలను అన్వేషించాలన్నారు. మిర్చికి కనీస మద్దతు ధర కల్పించేందుకు తాము కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కేంద్రమే మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసిందన్నారు. పోటీ పెరిగితే కచ్చితంగా ధర పెరుగుతుందన్నారు. యార్డులో రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు.



మినీ లారీ ఓనర్స్ యూనియన్ నాయకులు

## మినీ వాహనాలకు ప్రాధాన్యమివ్వండి

● ప్రభుత్వానికి మినీ ట్రాన్స్‌పోర్టు ఓనర్స్ యూనియన్ విజ్ఞప్తి

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణంలో మినీ(నాలుగు చక్రాలు) వాహనాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ది నేషనల్ మినీ ట్రాన్స్‌పోర్టు ఓనర్స్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఏటుకూరు బైపాస్ రోడ్డులోని యూనియన్ కార్యాలయంలో సభ్యులకు గుర్తింపు కార్డులు, ఇన్సూరెన్స్ పత్రాలను ఆదివారం పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు భోగ్యం రవి, సెక్రెటరీ కొప్పల్లి నాగేంద్రరావు, గౌరవ ప్రధాన సలహాదారులు మల్లికార్జునరావు మాట్లాడారు. యూనియన్‌లో మొత్తం 200 మంది సభ్యులు ఉన్నారని, రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. తమ యూనియన్‌కు ప్రభుత్వం తగిన సహకారం అందించాలని కోరారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా గుంటూరు జిల్లాలో యూనియన్ ఏర్పాటు చేయటం ఆనందకరమన్నారు. డ్రైవర్లను, వర్కర్లను ఏకతాటిపై తీసుకురావడం కోసం ఈ యూనియన్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్లా, జాయింట్ సెక్రెటరీ సంకటి పవన్ కుమార్, ట్రెజరర్ ఉప్పలదిన్ని శ్రీను, సలహాదారులు కొర్రపాటి కుమార్, నాదెండ్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు



భరతనాట్యం ప్రదర్శించిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందిస్తున్న ఉండవల్లి శ్రీదేవి, పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

## వైభవంగా శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్లలోని వేంకటేశ్వర స్వామి దేవస్థాన సొసైటీ (పెద్దగుడి) ఆధ్వర్యంలో 23వ వార్షిక బ్రహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, భరత నాట్యం, అన్నమయ్య కీర్తనలు ఆకట్టుకున్నాయి. అనంతరం వేదపండితులు గోపూజ నిర్వహించారు. స్వామి వారి కల్యాణంలో ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరతనాట్యం ప్రదర్శించిన చిన్నారులను ఆమె అభినందించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమాలను దేవస్థాన ఛైర్మన్ కే ఆంజనేయులు, అధ్యక్షుడు వై వేణుగోపాల్ పర్యవేక్షించారు.

# ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు



మార్కెట్‌లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడంలో చాలా మంది ఇంజనీరింగ్ విద్యార్థులు వెనకబడుతుంటారు. ఇందుకు ప్రధాన కారణం ఉద్యోగానికి అవసరమైన స్కిల్స్‌ను నేర్చుకోకపోవడమే. అలాంటి వారికి ఇంటర్న్‌షిప్‌లు ఉపయోగపడుతుంటాయి. వీటి ద్వారా కాలేజీలో నేర్చుకున్న థియరిటికల్ నాలెడ్జిని రియల్ వరల్డ్ సిట్యువేషన్స్‌కు అప్లై చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రొఫెషనల్ లైఫ్‌కి కావాల్సిన ఇన్‌సైట్స్ తెలుసుకోవడంలో ఇంటర్న్‌షిప్స్ ఉపయోగపడతాయి. అకడమిక్‌కి, ప్రొఫెషనల్ లైఫ్‌కి కావాల్సిన స్కిల్స్ తేడా వారికి అవగతమవుతుంది. ప్రభుత్వ రంగ సంస్థలు అందించే కొన్ని ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్స్ ఇవి. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

### నేషనల్ రెన్యువబుల్ ఎనర్జీ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్

కేంద్ర పునరుత్పాదన మంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటర్న్‌షిప్ ఇది. ఇంజనీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, లా తదితర ప్రోగ్రామ్స్ చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మంత్రిత్వశాఖ అవసరాలను బట్టి సంవత్సరానికి రెండుసార్లు కూడా దీనిని ప్రకటిస్తారు. ఈ ఇంటర్న్‌షిప్ కాలపరిమితి రెండు నుంచి ఆరు నెలలు ఉంటుంది. నెలకు 15 వేల రూపాయలు ఉపకారవేతనం ఇస్తారు. https://mnre.gov.in/en/national-renewable-energy-internship-programme-2/

### ఐఐటీ పాలక్కడ్ సమ్మర్ ఇంటర్న్‌షిప్

ఈ ఇంటర్న్‌షిప్ ఇంజనీరింగ్, సైన్స్, హ్యూమానిటీస్ విద్యార్థులకు ఉద్దేశించినది. మూడు లేదా నాలుగో సంవత్సరం చదువుతున్నవారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆరువారాల ఈ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లో హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన రీసెర్చ్ ట్రైనింగ్ ఉంటుంది. 12000/- స్టయిఫండ్ కూడా ఇస్తారు. 2025 మార్చి 15లోపు దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు https://sun.iitpkd. ac.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

### డిజిటల్ ఇండియా ఇంటర్న్‌షిప్ స్కీమ్

ఈ ఇంటర్న్‌షిప్‌ను మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అందిస్తుంది. ఇంజనీరింగ్ యూజీ, పీజీ, లా చేస్తున్న విద్యార్థులు దీనికి అర్హులు. ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకునే ముందు రాసిన పరీక్షలో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. రెండు నెలల కాలవ్యవధి ఉంటుంది. నెలకు పదివేల రూపాయల స్టయిఫండ్ ఇస్తారు. www.meity.gov.in

### వాద్వానీ, మద్రాస్ ఐఐటీ సమ్మర్ ఇంటర్న్‌షిప్స్

వాద్వానీ స్కూల్ ఆఫ్ డేటా సైన్స్ అండ్ ఏఐ, మద్రాస్ ఐఐటీ కలిసి ఉమ్మడిగా ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ని అందిస్తున్నాయి. ఇంజనీరింగ్ లేదా సైన్స్ బ్రాంచ్‌ల్లో యూజీ ప్రోగ్రామ్‌లో ఫైనల్ ఇయర్ చదువుతున్నవారు, పీజీ అయితే మొదటి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్న్‌షిప్ కాల వ్యవధి మూడు నుంచి ఆరు నెలలు ఉంటుంది. వ్యక్తిగతంగా హాజరయి పూర్తి చేయాల్సిన ఇంటర్న్‌షిప్ ఇది. వీరికి స్టయిఫండ్ కూడా అందజేస్తారు. దరఖాస్తులు 2025 ఫిబ్రవరి 15లోపు పంపుకోవాలి.
https://wsai.iitm.ac.in/2025/01/05/wsai-summer-internships-2025/

### టెక్ ఇంటర్న్‌షిప్ స్కీమ్

ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్‌కు చెందిన 'టెలీకామ్ ఇంజనీరింగ్ సెంటర్' ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ నిర్వహిస్తోంది. ఆరు నెలలపాటు ఇది ఉంటుంది. అవసరమైన పక్షంలో దీనిని ఒక సంవత్సరం వరకు పొడిగించుకోవచ్చు. ఇంటర్న్‌షిప్‌లో మొత్తం రూ.15,000స్టయిఫండ్ ఇస్తారు. https://www.myscheme.gov.in/schemes/tecis#details

## దిక్సూచి DIKSUCHI

# BITSAT 2025 నోటిఫికేషన్ విడుదల

**దేశంలోని ఇంజనీరింగ్ విద్యను అందించే ప్రతిష్ఠాత్మక సంస్థలో 'బిర్లా ఇన్‌స్టిట్యూట్' (బిట్స్) ఒకటి. పిలానీ, గోవా, హైదరాబాద్‌ల్లో బిట్స్‌కు క్యాంపస్‌లు ఉన్నాయి. ఇంజనీరింగ్ చదవాలనుకునే విద్యార్థులు జేఈఈ, తమ రాష్ట్రాల ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లతో పాటుగా దీనిని కూడా రాస్తుంటారు.**

బిట్స్ ఎంట్రెన్స్ స్కోరుకు కూడా కొన్ని ఇతర సంస్థలు అడ్మిషన్ ఇస్తున్నాయి. ఇంటర్మీడియేట్ అర్హతతో బీఈ, బీఫార్మసీ, ఎమ్మెస్సీ కోర్సుల్లో చేరవచ్చు. ఇంటర్ సబ్జెక్టులతోపాటు ఈ ఎంట్రెన్స్‌లో ఇంగ్లీష్, లాజికల్ రీజనింగ్‌ల్లో కూడా ప్రశ్నలు అడుగుతారు. జేఈఈ స్థాయిలో అత్యుత్తమంగా స్కోరు సాధించిన విద్యార్థులకు ఇక్కడ సీటు లభిస్తుంది. 390కి కనీసం 240 మార్కులు సాధించిన వారికి సీటు దొరికే అవకాశం ఉంది. బీఫార్మసీకి అయితే ఇంకా తక్కువ స్కోరుకు కూడా దొరుకుతుంది.

**బిట్స్ ఎంట్రెన్స్ 2025 పరీక్ష రెండు సెషన్లలో జరుగుతుంది.**

- సెషన్-1 ఎంట్రెన్స్ 2025 మే 26 తేదీ నుంచి 30వ తేదీ వరకు.
- సెషన్-2 ఎంట్రెన్స్ 2025 జూన్ 22 తేదీ నుంచి 26 తేదీ వరకు.

**దరఖాస్తులకు చివరి తేదీ:** 2025 ఏప్రిల్ 18

ఆసక్తి గల అభ్యర్థులు రెండు సెషన్లు లేదా ఒక్క సెషన్ అయినా రాయవచ్చు. రెండింటిలో అత్యుత్తమంగా సాధించిన మార్కులనే ఫైనల్ స్కోరుగా పరిగణనలోకి తీసుకుంటారు.

**కోర్సులు:**

**బీఈ:** కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, మెకానికల్, మాన్యుఫ్యాక్చరింగ్, ఎన్విరాన్‌మెంటల్ అండ్ సస్టయినబిలిటీ.


**బీఫార్మసీ:**

**ఎమ్మెస్సీ:** మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయలాజికల్ సైన్సెస్, ఎకనామిక్స్, సెమీ కండక్టర్ అండ్ నానో సైన్స్, జనరల్ స్టడీస్.

**పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, మహబూబ్ నగర్, విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం,

**సబ్జెక్టులు:** ఇందులో నాలుగు విభాగాలు ఉంటాయి.
పార్ట్-1: ఫిజిక్స్ 30,
పార్ట్-2: కెమిస్ట్రీ 30,
పార్ట్ 3
ఏ. ఇంగ్లీష్ ప్రొఫిషియన్సీ 10,
బి. లాజికల్ రీజనింగ్ 20.
పార్ట్-4: మేథ్స్/బయాలజీ(బీఫార్మసీ కోసం) 40 ప్రశ్నలు ఉంటాయి.

**పరీక్ష విధానం:** పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుంది. మొత్తం 130 ప్రశ్నలను మూడు గంటల్లో పూర్తిచేయాలి. అయితే సమయానికి సంబంధించి సెక్షన్ల వారీ నిబంధనలు లేవు. కానీ నెగెటివ్ మార్కింగ్ ఉంది. ప్రతీ సరైన జవాబుకు మూడు మార్కులు, తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.



## SCHOLARSHIP ALERT

### Tata Capital Pankh

***Description:*** An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.
***Eligibility:*** Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.
***Prizes & Rewards:*** Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less) ***Last Date:*** 15-02-2025
***Application mode:*** Online applications only
***Short Url:*** www.b4s.in/aj/TCPS27

### JK Tyre Shiksha Sarthi

***Description:*** JK Tyre & Industries Pri vate Limited invites applications from the daughters of heavy vehicle drivers who are pursuing technical or non-technical undergraduate or diploma courses and reside in select locations.
***Eligibility:*** Female students who are daughters of heavy vehicle drivers and pursuing technical or non-technical undergraduate or diploma courses are eligible to apply. Students must have received a minimum of 55% marks in their previous academic year. The annual family income of applicants must be less than or equal to INR 5,00,000. Applicants must be residents of Rajasthan, Madhya Pradesh, Uttara khand, Karnataka, or Tamil Nadu.
***Prizes & Rewards:*** One-time scholarship:
***Technical Undergraduate Courses:*** INR 25,000
***Non-Technical Undergraduate Courses:*** INR 15,000 ***Diploma Courses:*** INR 15,000
***Last Date to Apply:*** 15-02-2025
***Application mode:*** Online only
***Short Url:*** www.b4s.in/aj/JKTS1

### Charpak Bachelor's

***Description:*** Charpak Bachelor's Scholarship 2025 is an opportunity offered by the French Government to Indian students who wish to pursue a full-time undergraduate degree in one of the institutions in France.
***Eligibility:*** Open for Indian nationals or OCI card holders who are 23 years old or younger at the time of application. Applicants must have completed secondary school in India and have applied for a bachelor's degree program starting on 1st September 2025. Students must have never previously studied at an educational institution in France.
***Prizes & Rewards:*** The scholarship offers a monthly living allowance of 860 euros and other benefits.
***Last Date to Apply:*** 28-02-2025
***Application mode:*** Online only
***Short Url:*** www.b4s.in/aj/CBSS3

buddy4study.com

## చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

### విజయ్ సినిమాలో సంజయ్‌దత్?

విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ ఓ అతిథి పాత్రలో కనిపించనున్నారనే వార్త టాలీవుడ్‌లో ప్రచారమవుతోంది. అంతేకాదు 'ద మమ్మీ' యాక్టర్ అర్నాల్డ్ వోస్లూ కూడా ఓ కీలక పాత్రలో నటించనున్నాడనే వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలపై మేకర్స్ ఇప్పటివరకూ స్పందించలేదు. కాగా, ఈ సినిమాలో విజయ్ దేవరకొండ ఓ సరికొత్త పాత్రలో కనిపించనున్నాడట. 1854-78 మధ్య కాలంలో జరిగే కథ కాబట్టి, సినిమాలో చాలా వేరియేషన్స్ ఉంటాయని తెలుస్తోంది. చిత్ర షూటింగ్ ఈనెల మూడో వారంలో ప్రారంభం కానున్నట్లు సమాచారం. మొదటి షెడ్యూల్‌లో విజయ్ దేవరకొండ ఎంట్రీ సీన్‌ను చిత్రీకరించనున్నట్లు టాక్. నాని హీరోగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో వచ్చిన 'శ్యామ్ సింగరాయ్' చిత్రం విజయవంతమైంది. దీంతో విజయ్ దేవరకొండ సినిమాపై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి.




ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు విజయ్ తన తల్లితో కలసి హాజరయ్యారు. వారు త్రివేణి సంగమంలో ఆదివారం పుణ్యస్నానాలు చేసారు.

#### త్వరలో వీడీ12 టైటిల్ టీజర్

విజయ్ దేవరకొండ హీరోగా గౌతం తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న వీడీ12(వర్కింగ్ టైటిల్) టైటిల్ టీజర్ ఈనెలలోనే వెలువడనున్నట్లు వార్తలొస్తున్నాయి. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా హిందీ టీజర్‌కు రణబీర్ కపూర్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. అదేవిధంగా తెలుగుకు ఎన్టీఆర్, తమిళ్‌కు ధనుష్ వాయిస్ ఓవర్ ఇచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

### అజిత్ కారుకు మళ్లీ ప్రమాదం



పోర్చుగల్ కార్ రేస్ పోటీల కోసం శిక్షణ పొందుతున్న హీరో అజిత్ కారు మరోమారు ప్రమాదానికి గురైంది. ఈ విషయాన్ని అజిత్ ఆదివారం వెల్లడించారు. 'నా అభిమానులు మాత్రమే కాకుండా, నేను ఏం చేయబోతున్నానో తెలుసుకునేందుకు అమితాసక్తితో ఎదురుచూస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. ఈ రోజు కూడా శిక్షణలో నా కారు స్వల్ప ప్రమాదానికి గురైంది. దాన్ని మెకానిక్ బృందం రిపేర్ చేసింది' అని ఒక వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. కాగా, ఇటీవల దుబాయ్ వేదికగా జరిగిన 24హెచ్ కార్ రేస్ పోటీల కోసం శిక్షణ పొందుతుండగా, అజిత్ కారు ప్రమాదానికి గురైన విషయం తెల్సిందే. దీంతో ఆ పోటీల నుంచి అజిత్ తప్పుకున్నారు. అయినప్పటికీ అజిత్ కుమార్ రేసింగ్ టీం ఆ పోటీల్లో మూడో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. దీంతో అజిత్ కుమార్‌కు 'లిబర్టీ ఆఫ్ ది గేమ్' అనే అవార్డును కూడా ప్రదానం చేశారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

# నాటి ప్రజారాజ్యమే నేటి జనసేన



- తొలిసారి 'జై జనసేన' అంటూ నినదించిన చిరంజీవి
- ఒక్కోసారి కొన్ని సినిమాలు ఆడొచ్చు, ఆడకపోవచ్చు
- 'పుష్ప 2' ఘన విజయాన్ని స్వాగతిస్తున్నా
- ఇండస్ట్రీ అంతా ఒకటే కాంపౌండ్

"ప్రజారాజ్యం పార్టీ జనసేనగా రూపాంతరం చెందింది. అందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు అంతా జనసేనే. జై జనసేన' అంటూ నినదించి మెగా అభిమానులను ఉత్సాహపరిచారు చిరంజీవి. విష్వక్‌సేన్ కథానాయకుడిగా నటించిన 'లైలా' చిత్రం ఈనెల 14 న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ కార్యక్రమానికి చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదికపైన ఉన్న విష్వక్‌సేన్ తండ్రి కరాటే రాజుతో తన అనుబంధం గురించి ప్రస్తావిస్తూ చిరంజీవి పై వ్యాఖ్యలు చేశారు. 'మేం ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు రాజకీయంగా ఎదగాలనే తన కోరికను కరాటే రాజు నా దగ్గర ప్రస్తావించాడు. దాంతో ప్రజారాజ్యం తరఫున అవకాశం ఇచ్చాం. కానీ అప్పట్లో పరిస్థితులు ఇంకోలా ఉన్నాయి' అని చిరంజీవి చెప్పారు. అలాగే మేనల్లుడు అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' విజయం పట్ల చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. "పుష్ప 2' పెద్ద హిట్టయింది. అందుకు నేను గర్విస్తున్నా. ఒక్కోసారి కొన్ని సినిమాలు ఆడొచ్చు, ఆడకపోవచ్చు. కానీ ఒక సినిమా బాగా ఆడితే దాన్ని ఇండస్ట్రీలో ప్రతి ఒక్కరూ హర్షించాలి' అన్నారు.

#### విష్వక్‌ను బాలకృష్ణ మనిషి అన్నారు

"నా బాల్యంలో ఎన్టీఆర్, ఏఎన్నార్ అభిమానులు రక్తం వచ్చేలా కొట్టుకోవడం చూశాను. ఆ సంఘటన ప్రభావంతో నేను సినిమాల్లోకి వచ్చాక మా హీరోల మధ్య సఖ్యత కోసం కృషి చేశాను. 'విష్వక్సేన్ ఫంక్షన్‌కు వెళ్తున్నావా? అతను మన మనిషి కాదు, బాలకృష్ణ మనిషి. అప్పుడప్పుడూ 'తారక్' అని కూడా అంటాడు. ఆ కార్యక్రమానికి వెళ్లొద్దు" అని కొందరు నాతో అన్నారు. మనుషులన్నాక వేరేవాళ్ల మీద ప్రేమ, అభిమానం ఉండకూడదా? అభిమానం పర్సనల్. జిహ్వకో రుచి అన్నట్లు యాక్టర్‌గా కొంతమంది కొందరికి కనెక్ట్ అవుతారు. దాన్ని మనమంతా అంగీకరించాలి. రామ్ చరణ్‌కు సూర్య అంటే చాలా ఇష్టం. అంతమాత్రాన వాడితో నేను కలసి ఉండకూడదా? ఇక నుంచైనా మా గురించి ఆ కాంపౌండ్, ఈ కాంపౌండ్ అంటూ మాట్లాడరనే అనుకుంటున్నాను. ఇండస్ట్రీ అంతా ఒకటే కాంపౌండ్' అని చెప్పారు. 'లైలా' సినిమాతో విష్వక్‌సేన్, దర్శకుడు రామ్ నారాయణ్, నిర్మాత సాహూ గారపాటి పెద్ద విజయాన్ని అందుకోవాలని చిరంజీవి ఆకాంక్షించారు. 'ఇది నా కెరీర్‌లో స్పెషల్ మూవీ. జనాల్ని నవ్వించాలని డిసైడ్ అయ్యాను ' అని విష్వక్‌సేన్ అన్నారు. లైలా లాంటి పాత్ర చేయడానికి విష్వక్ తప్ప మరో హీరో ముందుకురాడు అని సాహూ గారపాటి అన్నారు. విష్వక్ ఈ సినిమాను అంగీకరించడమే నాకు పెద్ద బహుమతి అని . రామ్ నారాయణ్ చెప్పారు.

### పుష్ప జీవితాంతం గుర్తుంటుంది




అల్లు అర్జున్

"'పుష్ప' సినీ ప్రయాణంలో ఐదు నిమిషాల నుంచి ఐదేండ్ల వరకూ భాగమైన ప్రతి ఒక్కరికీ నా కృతజ్ఞతలు. ఈ సక్సెస్ క్రెడిట్ దర్శకుడు సుకుమార్‌తో పాటు సినిమా కోసం కష్టపడి పనిచేసిన టీమ్‌కు దక్కుతుంది. ఆయన సీన్ చెప్తుంటే పిచ్చెక్కిపోతుంది. ఈ సినిమా కోసం వెచ్చించిన ఐదేళ్లు నాకెంతో ప్రత్యేకం. ఈ సినిమా అందరికీ జీవితాంతం గుర్తుండిపోతుంది. 'పుష్ప 3' ఓ అద్భుతం" అని 'పుష్ప 2' థ్యాంక్స్ మీట్‌లో అల్లు అర్జున్ అన్నారు. దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ "మైత్రీ మూవీస్ సీఈఓ, చెర్రీ సలహాతోనే 'పుష్ప' మూడు భాగాలుగా తయారైంది. ఈ విజయం మైత్రీ మూవీ మేకర్స్‌కి అంకితం చేస్తున్నాను. ఈ ప్రపంచంలో నన్ను ఎక్కువగా నమ్మే వ్యక్తి అల్లు అర్జున్" అని చెప్పారు. "ఈ సినిమా విజయం ఎంతో మంది కష్టంతో వచ్చింది. ఈ విజయానికి కారణమైన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు" అని నిర్మాత యలమంచిలి రవిశంకర్ అన్నారు. "సినిమా అంచనాలను మించి కలెక్ట్ చేస్తుందని అనుకున్నాం కానీ.. ఇంత ఘనవిజయం సాధిస్తుందని అనుకోలేదు" అని నిర్మాత నవీన్ యెర్నేని తెలిపారు.

### 'లూసిఫర్ 2'లో హాలీవుడ్ యాక్టర్లు



మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో పృథ్విరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎల్ 2 ఈ ఎంపురాన్'. 'లూసిఫర్' చిత్రానికి సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుంది. మార్చి 27న పాన్ ఇండియా స్థాయిలో మలయాళం, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు. ఆశిర్వాద్ సినిమాస్, లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మంజు వారియర్, టొవినో థామస్, ఇంద్రజిత్ సుకుమారన్, జైస్ జోస్ కీలక పాత్రల్లో నటించారు. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్, జైస్ జోస్ పోషించిన జేవియర్ పాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. జైస్ జోస్ ఈ మూవీ చిత్రీకరణ అనుభవాలను వీడియో ద్వారా పంచుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. కాగా, ఈ చిత్రం గురించి ఓ ఆసక్తికర అప్డేట్ వైరల్ అవుతోంది. ఈ సినిమాలో కొందరు ఇంటర్నేషనల్ యాక్టర్స్ నటిస్తున్నట్టుగా గతంలో వార్తలు వెలువడ్డాయి. అయితే ఇప్పుడు యూకేకు చెందిన ఇద్దరు యాక్షన్ స్టార్స్ నటించారనే వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. హాలీవుడ్‌కు చెందిన ఓ ఏజెన్సీ ఈ సమాచారాన్ని వెల్లడించింది. కొరియన్ అమెరికన్ నటులు రిక్ యూన్, ఆండ్రియా టి వాడర్ కూడా ఈ సినిమాలో నటించనున్నట్లు ఆ ఏజెన్సీ తొలుత సోషల్ మీడియాలో షేర్ చేసి ఆ తర్వాత డిలీట్ చేసినట్లు మాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.



### ఆ సినిమాను అంగీకరించారా?

హీరోయిన్ శ్రీలీల వరుస ఆఫర్లతో దూసుకుపోతున్నారు. ఇప్పటికే పవన్‌కల్యాణ్‌తో 'ఉస్తాద్ భగత్‌సింగ్', రవితేజతో 'మాస్ జాతర, నితిన్‌తో 'రాబిన్‌హుడ్', శివకార్తీకేయన్‌తో 'పరాశక్తి' సినిమాల్లో నటిస్తున్నారీ బ్యూటీ. అయితే, ఆమెకు మరో అసక్తికరమైన ప్రాజెక్ట్‌లో నటించేందుకు ఆఫర్ వచ్చిందని సమాచారం. 2023లో విడుదలై విజయవంతమైన 'మంగళవారం' సినిమా సీక్వెల్‌లో ఆమె నటిస్తున్నట్లు టాక్. తొలి భాగంలో కథానాయికగా నటించిన పాయల్ రాజ్‌పుత్ ఈ చిత్రం సీక్వెల్‌లో నటించట్లేదని తెలుస్తోంది. ఆమె స్థానంలో నటించేందుకు శ్రీలీలకు ఆఫర్ వచ్చిందట. ఇందుకు ఆమె అంగీకరించారా లేదా తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చేవరకూ ఆగాల్సిందే. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్టు పనుల్లో బిజీగా ఉన్నారు దర్శకుడు అజయ్ భూపతి. ఈ ఏడాదిలోనే సీక్వెల్‌ను పట్టాలెక్కించే ఆలోచనలో ఉన్నారు మేకర్స్.

### నటుడిగా నా స్థాయిని పెంచుతుంది

\- రాగ్ మయూర్



'సినిమా బండి, కీడా కోలా' తదితర చిత్రాలతో నటుడిగా రాగ్ మయూర్ చక్కని గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవలే 'విడుదలైన గాంధీ తాత చెట్టు' చిత్రంలో విలన్‌గా తన నటనకు మరోసారి ప్రేక్షకుల ప్రశంసలు అందుకొన్నారు. ప్రస్తుతం ఆయన 'గరివిడి లక్ష్మి' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా రాగ్ మయూర్ మాట్లాడుతూ 'ఫహద్ ఫాజిల్, రాజ్‌కుమార్ రావు లాంటి నటులు నాకు ఆదర్శం. వారిలా ముందు మంచి నటుడిగా నిరూపించుకొని ఆ తర్వాత హీరోగా ఎదగాలనేది నా ఆలోచన. అందుకే కెరీర్ ఆరంభం నుంచి ఎక్కువగా నటనకు ఆస్కారమున్న పాత్రలను మాత్రమే ఎంచుకుంటూ వస్తున్నాను. నేను హీరోగా నటిస్తున్న 'గరివిడి లక్ష్మి' చిత్రం గ్రామీణ నేపథ్యమున్న ప్రేమకథతో తెరకెక్కుతోంది. నటుడిగా ఇది నన్ను మరో మెట్టు ఎక్కించే చిత్రమవుతుంది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో జరిగే కథ ఇది. అక్కడి వేషభాషలను అవగాహన చేసుకునేందుకు కొన్నాళ్లు అక్కడే గడిపాను. 'గాంధీ తాత చెట్టు' చిత్రంలో నా పాత్రకు ప్రేక్షకులు, విమర్శకుల నుంచి చక్కని ప్రశంసలు దక్కడం ఆనందాన్నిచ్చింది' అని చెప్పారు.

# గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు



## మౌజన్‌లకు వేతనాలను చెల్లించి ఆదుకోవాలి

దుగ్గిరాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్‌నెల సమీపిస్తున్న తరుణంలో మౌజన్‌లు, ఇమామ్‌లకు ఇవ్వాల్సిన వేతన బకాయిలను చెల్లించి ఆదుకోవాలని జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని కోరారు. దుగ్గిరాలలోని ముర్తుజానగర్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుభాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి తొమ్మిది నెలలుగా వేతనాలు రావడం లేదని, ఆదాయం లేని మసీదుల్లో ప్రభుత్వం ఇచ్చే వేతనాలపై ఆధారపడి పనిచేస్తున్నారన్నారని, వీరికైనంత త్వరగా వేతనాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో షేక్ రహ్మాన్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## పాడిరైతులపై పశుపోషణ భారం

- ప్రతిఏటా పెరుగుతున్న వరి గడ్డి ధరలు
- భారంగా మారిన పశుపోషణ
- పెరిగిన మిషన్ కోతలు - తగ్గుతున్న గడ్డి

తాడికొండ ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు పశుపోషణ భారంగా మారింది. ప్రతి ఏటా పెరుగుతున్న వరిగడ్డి ధరల వల్ల పాడి రైతు దిగులు చెందుతున్నారు. అంతేకాకుండా దాణా రేటు కూడా పెరగటంతో పాడి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అంతేకాకుండా కొంతమంది మాగాణి రైతులు మిషన్లతో వరిని కోస్తున్నారు. దీంతో గడ్డి లభించటం లేదు. మండలపరిధిలో సుమారు పదివేల పాడి గేదెలు ఉన్నాయి. సరియైన నీటి వనరులు లేకపోవటం, వర్షాల మీదనే రైతులు అధారపడటంతో మాగాణి పంటను తక్కువగా పండిస్తున్నారు. దీంతో పొన్నూరు, తెనాలి, నంబూరు, రేపల్లే , కృష్ణా జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల పాడి రైతులకు ఖర్చులు విపరీతంగా పెరిగాయి. అంతే గాకుండా సకాలంలో వర్షాలు పడకపోవటం వల్ల కూడా మాగాణి సరిగా పండటం లేదు. మండలంలో మాగాణి 560 హెక్టార్లలో పండించారు. గత సంవత్సరం ట్రక్కు వరిగడ్డి రూ.11,500 నుంచి రూ.12,500లు ఉంటే, ఈ సంవత్సరం



ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్న వరిగడ్డి (ఫైల్‌ఫొటో)

ట్రక్కు గడ్డి రూ.15 వేల నుంచి రూ.16వేల వరకు ఉన్నదని పాడి రైతులు చెబుతున్నారు. టక్కు అద్దె రూ.1000 వరి గడ్డి కట్టలు కట్టటానికి రూ.1600లు, ముగ్గురు వ్యక్తుల కూలీ ఖర్చు రూ.1800 అవుతుంది. అయినా సరే పాల దిగుబడి కూడా తక్కువగా వస్తుంది. ఖర్చులకు దిగుబడికి మధ్య వ్యత్యాసం ఉండటంతో నష్టాల బారిన పడుతున్నారు. రైతులకు ప్రభుత్వం వారు తక్కువ ధరలకు వరి గడ్డిని సరఫరా చేస్తే పశుపోషణకు కొంత ఇబ్బందులు తగ్గుతాయని పలువురు పాడి రైతులు అంటున్నారు. అంతే కాకుండా వేసవిలో పశువులకు తాగటానికి కూడా సరియైన నీటి సదుపాయం ఉండటం లేదని వాపోతున్నారు. పశు గ్రాసం కోసం ప్రభుత్వం కొంత భూమిని ప్రతి గ్రామంలో కల్పిస్తే బాగుటుందని పలువురు రైతులు వాపోతున్నారు. కొంతమంది రైతులు పశుపోషణ చేయలేక కబేళాలకు పశువులను అమ్ముకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పాల దిగుబడికి సరియైన ధరలు కూడా లేక పోవడంవల్ల పశువులను అమ్ముకుంటున్నామని పాడి రైతులు తెలియజేస్తున్నారు. పశుగ్రాసాలను సబ్సిడీపై సరఫరా చేస్తేనే పశుపోషణ చేయవచ్చునని రైతులు అంటున్నారు. ప్రభుత్వం పాడి రైతులను అందుకునేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు వాపోతున్నారు.

## ఫాసిజానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

- మానవ హక్కుల వేదిక తెలంగాణ అధ్యక్షుడు ఎస్ తిరుపతయ్య



నాస్తిక సమావేశాల్లో ప్రసంగిస్తున్న తిరుపతయ్య

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలను చైతన్యవంతం చేసి ఫాసిజానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని మానవ హక్కుల వేదిక తెలంగాణ అధ్యక్షుడు ఎస్ తిరుపతయ్య పిలుపునిచ్చారు. మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలోని చార్వాకాశ్రమంలో జరుగుతున్న నాస్తిక మేళా రెండో రోజు సభలో ఆయన ప్రసంగించారు. ఈ సభకు జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షురాలు ఎస్ స్వరాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. తిరుపతయ్య మాట్లాడుతూ దేశంలో ఫాసిజం పెరిగిపోతుందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను హరిస్తూ మైనార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ఫాసిజం - మన కర్తవ్యాలు అనే అంశంపై విద్యా పరిరక్షణ కమిటీ ఏపీ కన్వీనర్ రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ పాలకులు, అధికార యంత్రాంగం అన్ని రంగాలను తమ గుప్పిట్లో పెట్టుకుని ప్రజల మధ్య కుల, మత చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రశ్నించే తత్వం కలిగిన వారిపై రాజద్రోహం కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. జాతీయ వనరులను సామ్రాజ్యవాదులకు కట్టబెడుతూ ప్రజలను ఆర్థిక, సామాజికంగా వంచనకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ అంశాలపై దళిత, బహుజనులను ఐక్యం చేసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సభలో కుల నిర్మూలన పోరాట సమితి అధ్యక్షుడు కృష్ణ, తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నేడు నులిపురుగుల మాత్రలు పంపిణీ

పెదనందిపాడు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఆయా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా సోమవారం నులిపురుగుల నిర్మూలన మాత్రలు పంపిణీ చేయనున్నట్లు సీహెచ్‌వో ప్రసాద్‌స్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 19సంవత్సరాలు లోపు కలిగిన విద్యార్థులకు ఆరోగ్య కార్యకర్తల ద్వారా పంపిణీ చేస్తారని, తప్పనిసరిగా ఈ మాత్రలను తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులు ప్రారంభిస్తారని తెలిపారు.

## ఘనంగా హోమాలు

పెదనందిపాడు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఉపాలయ, క్షేత్ర పాలకులుగా ఉన్న శ్రీపంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా ఆదివారం వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. అదివాసా, ప్రతిష్ఠా హోమాలు చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు.

## మిర్చి ధరలు తగ్గకుండా చర్యలు చేపట్టాలి

- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆదేశాలు

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో మిర్చి ధరలు తగ్గకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం గుంటూరులోని తన నివాసంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్లు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, మిర్చియార్డు సెక్రెటరీ చంద్రికతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మిర్చియార్డులో వివిధ రకాల మిరపకాయలకు లభిస్తున్న ధరలపై ఆరా తీశారు. ప్రస్తుత సీజన్‌లో మిర్చి ధరలు తగ్గడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్స్‌పోర్టులు, స్థానిక కొనుగోళ్లు పెరిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కమీషన్, ఎగుమతి వ్యాపారస్థులతో సమావేశం నిర్వహించి ధర పెరిగేందుకు మార్గాలను అన్వేషించాలన్నారు. మిర్చికి కనీస మద్దతు ధర కల్పించేందుకు తాము కేంద్ర ప్రభుత్వం



మార్కెటింగ్ అధికారులతో తన నివాసంలో సమావేశమైన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కేంద్రమే మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. పోటీ పెరిగితే కచ్చితంగా ధర పెరుగుతుందన్నారు. యార్డులో రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు.

## యువకులు సన్మార్గంలో నడవాలి

- ప్రొఫెసర్ ఆరోన్ రజనీకాంత్

కాకుమాను (గరికపాడు), ఫిబ్రవరి 9 (ఆంధ్ర జ్యోతి): నేటి యువత మంచి మార్గాల్లో నడచి కుటుంబానికి, సంఘానికి మంచి పేరు తీసుకురావాలని ప్రొఫెసర్ ఆరోన్ రజనీకాంత్ అన్నారు. మండలపరిధిలోని గరికపాడులో ఆంధ్ర సౌహార్తిక సెయింట్ పాల్ లూథరన్ చర్చి శత వార్షిక మహోత్సవం ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ ఆరోన్ రజనీకాంత్ మాట్లాడుతూ క్రీస్తు మార్గంలో పయనించే వారికి సంతోషాలు ఉంటాయని తెలిపారు. శాంతికి ప్రతీక క్రీస్తు అని కొనియాడారు. ముగింపు ప్రార్థనల అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చర్చి కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎస్ దాస్, కో కన్వీనర్ యోహోషువా, కో ఆర్డినేటర్ మార్టిన్ లూథర్ శాస్త్రి, విశాంత్ర తహసీల్దార్ కూచిపూడి నెహ్రూ, సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## పున్నారావుకు రైతు జేఏసీ, టీడీపీ నాయకుల నివాళి



పున్నారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న రైతు జేఏసీ నాయకులు పువ్వాడ సుధాకరరావు పలువురు టీడీపీ నేతలు

తుళ్లూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత రాజధాని రైతు కాకుమాను పూర్ణచంద్రరావుకు (పున్నారావు)కు శాఖమూరులోని ఆయన స్వగృహంలో నివాళి అర్పించారు. మొదటి నుంచి టీడీపీకి వీర అభిమానిగా కొనసాగుతున్న పున్నారావు ఇటీవల మృతి చెందాడు. ఆదివారం శాఖమూరులో ఆయన సంస్మరణ కార్యక్రమం జరిగింది. పున్నారావు చిత్రపటానికి అమరావతి రైతు జేఏసీ సమన్వయ కమిటీ సభ్యులు పువ్వాడ సుధాకరరావు, మాజీ సర్పంచులు ఆరుద్రల సదాశివరావు, కాకుమాను చెన్నకేశవరావులు, పున్నారావు మిత్రమండలి సభ్యులు జమ్ముల వెంకట్రాయుడు ఆయన మిత్రులు, టీడీపీ నేతలు ఆరుద్రల సుబ్బారావు, పుసులూరి మురళి పున్నారావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు మాట్లాడుతూ మొదటి నుంచి పున్నారావు టీడీపీకి క్రియాశీలకంగా పని చేశారన్నారు. ఆయన మృతి చాలా బాధాకరమన్నారు.

## ఆయుర్వేద వైద్యశిబిరానికి విశేష స్పందన



ఆయుర్వేద మెడికల్ క్యాంపులో మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్లు

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్య సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అనంతవరప్పాడు గ్రామంలో ఆదివారం డాక్టర్ బీ రమేష్ పర్యవేక్షణలో గుంటూరు జిల్లా దేశీయ వైద్యసంఘం అధ్యక్షుడు నామాల శ్రీనివాసరావు, సంఘ సభ్యులు పీవీ హనుమంతరావు, రామారావు తదితరులు పాల్గొని పేదలకు రోగ నిర్ధారణ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

## వంతెన నిర్మాణ అంచనాలను త్వరలో పూర్తి చేస్తాం

- జేఈ స్వర్ణలత

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు లేమల్లెపాడు గ్రామ రైతులు కోరిన డ్రెయినేజ్ సర్‌ప్లస్ కోర్సుల వద్ద వంతెన నిర్మాణాలకు ఆదివారం డ్రెయినేజ్ జేఈ స్వర్ణలత, సర్వే యర్ హనుమంతరావు రైతులతో కలసి బ్రిడ్జి నిర్మాణానికి కొలతలు నిర్వహించారు. ఇటీవల వట్టిచెరుకూరు, లేమల్లెపాడు గ్రామాల పరిధిలోని సాగులో ఉన్న భూములకు వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులను రైతులు ఎమ్మెల్యే రామాంజనేయులు దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో తక్షణమే స్పందించిన బాపట్ల డివిజన్ డ్రెయినేజ్ డీఈ, అలాగే జేఈ స్వర్ణలతలు రైతులతో క్షేత్ర స్థాయిలో పరిశీలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లేమల్లెపాడు గ్రామం నుంచి వచ్చే డ్రెయినేజ్ తెల్లవాగు ద్వారా వచ్చే నీటి ప్రవాహం సర్‌ప్లస్ కోర్సులో ఏ స్థాయిలో ఉధృతంగా ప్రవహిస్తుందో అదేస్థాయిలో వంతెన ఎత్తు, వెడల్పు సరిపోతుందో అలాగే కొండవీటి వాగు వద్ద



వట్టిచెరుకూరు సమీపంలో కొండవీటివాగు సర్‌ప్లస్ కోర్సు వద్ద సర్వే నిర్వహిస్తున్న డ్రెయినేజ్ అధికారులు

నిర్మించనున్న వంతెన ఎత్తు, వెడల్పు అంచనాల కోసం సర్వే కొలతలు తీశారని, నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని జేఈ స్వర్ణలత వెల్లడించారు.

## ఘంటసాల 51వ వర్ధంతి



ప్రముఖ గాయకుడు ఘంటసాల వర్ధంతి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

తుళ్లూరు ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత గాయకులు ఘంటసాల వెంకటేశ్వరావు వర్ధంతి మహోత్సవాలు తుళ్లూరులో జరిగాయి. గ్రంథాలయం సెంటర్లో కరపత్రాలు ఆవిష్కరించారు. కమిటీ అధ్యక్షుడు దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతి అడ్డంకులు తొలగించుకొని అభివృద్ధి వైపు అడుగులు వేయటంపై హర్షం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్, ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలని కోట వెంకటేశ్వరరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ తెలుగు వారి సాంస్కృతిక పద్మశ్రీ ఘంటసాల అని అన్నారు. భావితరాలకు మన తెలుగువారి సాంస్కృతిక వారసత్వాన్ని అందించాలని కోట పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు, అనిల్, రవితేజ, మహేష్‌బాబు, రాజశేఖర్‌రెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో మార్పులు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లానేత పాశం రామారావు

పెదనందిపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజా సంక్షేమానికి అనుగుణంగా మార్పులు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేటర్లకు రాయితీలు ఇస్తూ ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం, ఉపాధి కల్పన వంటి అంశాల ఊసేలేదన్నారు. మధ్యతరగతికి స్వల్పంగా పన్నులు తగ్గించి నూటికి 90శాతం పైగా సామాన్యులపై భారం మోపారన్నారు. ఆరోగ్యం, విద్య, వైద్యం, ప్రజాపంపిణీ వ్యవస్థకు నిధులు కేటాయింపులు లేదన్నారు. రైతులు పండించిన అన్ని పంటలకు మద్దతు ధరలు తేవాలని కోరారు. రాజధాని అమరావతి నిర్మాణానికి అప్పురూపంలో కాకుండా గ్రాంటుగా నిధులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు, నాయకులు కొత్త వెంకటశివరావు, జంపని రామారావు, నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## గండాలయపేటలో వైద్యశిబిరం



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మంగళగిరి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి గండాలయపేటలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎన్ మాధవీలత జ్యోతి ప్రజ్వలన చేసి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. సాధారణ జబ్బులు, దంత, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఎన్ మాధవీలత, డాక్టర్ మాజేటి వంశీకృష్ణ, డాక్టర్ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో సుమారు వందమందికి వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీసత్య సాయి సేవా సంస్థ మెడికల్ ఇన్‌చార్జి పూసపాటి సాయికృష్ణ, సత్యసాయి భజన మండలి కన్వీనర్ డాక్టర్ రామారావు, సీపీఎం నేత చెంగయ్య, డీవైఎఫ్ఐ నేత ఎన్ నాగేశ్వరరావు, చైతన్య, ఎస్ రమేష్, కిట్టుసాయి, ఎస్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీషిర్డిసాయి - శ్రీపర్తిసాయి ఆలయ వార్షికోత్సవం



సాయినాథుని అభిషేకాల్లో పాల్గొన్న మహిళలు

దుగ్గిరాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని శ్రీషిర్డి సాయి - శ్రీపర్తి సాయి మందిరం 19వ వార్షికోత్సవం మూడ్రోజులపాటు వైభవంగా నిర్వహించారు. తొలి రోజు శ్రీషిర్డి, శ్రీసత్య సాయిబాబాలకు అభిషేకాలు, పలువురు దంపతులచే గాయత్రీ హోమం చేశారు. రెండో రోజు స్వామి వారి గ్రామోత్సవం, మూడో రోజు భక్తులచే సామూహిక శ్రీసత్యసాయి సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించారు. స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాదాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారి ఊయలసేవ నిర్వహించారు.

## నేటి నుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 119 కేంద్రాలు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ విద్యార్థులకు (ఎంపీసీ, బైపీసీ) విద్యార్థులకు నేటి నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా మొత్తం 119 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐవో జీకే జుబేర్ వెల్లడించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం



ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు పరీక్షలు ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షలకు మొత్తం 26,308 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షల కోసం ఇప్పటికే పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు. నిర్ధేశించిన పరీక్ష కేంద్రాల్లో ల్యాబు పరికరాలు, రసాయనాలు, ఇతర మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు అసరమైన పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్‌బోర్డు అధికారులు స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే ఇప్పటికే వృత్తి విద్యాకోర్సులు చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈనెల 5 నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. వృత్తి కోర్సులకు సంబంధించి మొదటి సంత్సరం 1215 మంది, ద్వితీయ సంవత్సరం 867 మంది పరీక్షలు హాజరుకానున్నారు.

## ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి : ఎస్ఐ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ వెంకట్

మంగళగిరి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని మంగళగిరి రూరల్ సీఐ వై శ్రీనివాసరావు సూచించారు. మంగళగిరి మండలం చినకాకాని వైజంక్షన్ వద్ద ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా సంబంధిత ధ్రువీకరణ పత్రాలు కలిగిఉండాలని, లేనిపక్షంలో వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలను ఇవ్వరాదని, అలా ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

## పాల్ హారీస్ సొసైటీ సభ్యుడు జనార్ధన్‌కు నివాళి



బీసీ జనార్ధన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పెదనందిపాడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక అశోక పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ జిల్లా-3150లో పేదలకు సైకిళ్లు, కుట్టు మిషన్ల దాత రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ సభ్యులు మేజర్ డోనాల్డ్ మరియు పాల్ హారీస్ సొసైటీ సభ్యులు బీసీ జనార్ధన్ అకాల మరణం చెందడంతో ఆయన చిత్రపటానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో రోటరీ డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు నల్లపునేని శివప్రసాద్, కోశాధికారి కోడూరి నాగేశ్వరరావు, వై రమణయ్య, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ చాలీసా పోటీలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ రోడ్డులోని గోవర్ధన స్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ చాలీసా పోటీలు నిర్వహించారు. శ్రీలక్ష్మి శారదా సంగీత నిలయం ఆధ్వర్యంలో బాల బాలికలకు రెండు విభాగాల్లో పోటీలు జరిపారు. చాలీసాలోని 40 శ్లోకాలను రాగయుక్తంగా ఆలపించారు. జూనియర్ విభాగంలో విజేతలు పార్థు, తన్మయి, లక్ష్మీప్రణతి, సీనియర్స్ విభాగంలో సుచరిత, రత్న ప్రియాంక, సాయితేజస్వీలకు బహుమతులు అందజేశారు. మరో 9 మందికి కన్సోలేషన్ బహుమతులు ఇచ్చారు. ఆదినారాయణ, శారదా చలపతి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన పోటీల్లో ఆంజనేయ శాస్త్రి, కొండపి శ్రీనివాసరావు, సౌజన్య, బాల చంద్రమౌళి, రఘు పర్యవేక్షించారు.

## ప్రశాంతంగా హిందీ పరీక్షలు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో పరిచయ, ప్రాథమిక, మాధ్యమ పరీక్షలు ఆదివారం స్థానిక సీతారామ్‌నగర్(మంగళగిరి రోడ్డు) లోని శ్రీసరస్వతీ కమిటీ ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ స్కూల్లో జరిగాయి. ఈ పరీక్షలకు పరిచయ, ప్రాథమిక మాధ్యమ పరీక్షలకు 56 మందికి విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారని పాఠశాల కార్యదర్శి డీవీ సుబ్బారావు తెలిపారు. పరీక్షలకు సూపరింటెండెంట్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయిని మానసవీణ, ఉపాధ్యాయులు అరుణకుమారి, నాగ మేరి, విజయలక్ష్మి ఇన్విజిలేటర్సుగా వ్యవహరించారని తెలిపారు

## మినీ వాహనాలకు ప్రాధాన్యమివ్వండి

- ప్రభుత్వానికి మినీ ట్రాన్స్‌పోర్టు ఓనర్స్ యూనియన్ విజ్ఞప్తి

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణంలో మినీ(నాలుగు చక్రాలు) వాహనాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ది నేషనల్ మినీ ట్రాన్స్‌పోర్టు ఓనర్స్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఏటు కూరు బైపాస్ రోడ్డులోని యూనియన్ కార్యాలయంలో సభ్యులకు గుర్తింపు కార్డులు, ఇన్సూరెన్స్ పత్రాలను ఆదివారం పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు భోగ్యం రవి, సెక్రటరీ కొప్పల్లి నాగేంద్రరావు, గౌరవ ప్రధాన సలహాదారులు మల్లికార్జునరావు మాట్లా డారు. యూనియన్‌లో మొత్తం 200 మంది సభ్యులు ఉన్నారని, రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. తమ యూనియన్‌కు ప్రభుత్వం తగిన సహకారం అందించాలని కోరారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా గుంటూరు జిల్లాలో యూనియన్ ఏర్పాటు చేయటం ఆనందకరమన్నారు.

## చేపలు, మాంసం అనధికారికంగా విక్రయిస్తే చర్యలు

- కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం దృష్ట్యా నగరంలో చేపలు, మాంసం అనధికారికంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ స్థానిక మణిపురం బ్రిడ్జి కింద చేపల మార్కెట్, నల్లపాడు రోడ్డు, రెడ్డి కాలేజీ రోడ్డు, మిర్చి యార్డు, నవభారత నగర్, గోరంట్ల, ఆర్‌టీవో ఆఫీసు, గుజ్జనగుండ్ల, అమరావతి రోడ్డు, పొన్నూరు రోడ్డు, పట్టాభిపురం ప్రాంతాల్లోని రోడ్లపై అనధికారికంగా చేపలు, మాంసం విక్రయిస్తున్న వారిని గుర్తించి దాడులు నిర్వహించామని, వాటిని తొలగించినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి అపరాధ రుసుం వసూలు చేశా మన్నారు. నగర పరిధిలో ఎక్కడైనా అనధికారికంగా నాటుకోళ్ళు, చేపలు, మాంసం విక్రయాలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. అపరాధ రుసుం విధించడమే కాక చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రతి వారం నగర పాలక సంస్థ ప్రజారోగ్యాధికారులు బృందాలుగా ఏర్పడి దాడులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## నేర్చుకున్న విద్యను ఆచరించడమే గురువుకు నిజమైన దక్షిణ

- పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తాను ఏ గురువు దగ్గర విద్యను అభ్యసిస్తాడో వాటిని ఆచరించడమే ఆ గురువుకు ఇచ్చే నిజమైన దక్షిణ అని మహా సహస్రావధాని పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని శ్రీరమాసత్యనారాయణ స్వామి దేవాలయ ప్రాంగణంలో 48వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం 'మహాభారత యుద్ధంలో భగవానుని పాత్ర' అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. నరసింహారావు ప్రవచనం చేస్తూ మొదటి పదిరోజులు భీష్మాచార్యుడు కురుక్షేత్ర యుద్ధాన్ని నిర్వహించారని దాని వల్ల కౌరవులకు ఏమి లాభం జరగలేదన్నారు. దుర్యోధనుడు భీష్ముని కన్న ముందుగా యుద్ధానికి సర్వసైన్యాధ్యక్షుడిగా కర్ణుడిని పెట్టిన యుద్ధం ఇన్నిరోజులు సాగేది కాదని నిష్ఠులాడారన్నారు. తొలుత అభి మన్యుని యుద్ధానికి పంపడానికి విముఖత చూపిన ధర్మరాజు పరిస్థితుల ప్రభావంతో పంపవలసివచ్చిందన్నారు. తిరుపతి వేంకట కవులు మహాభారత కథను నాటక రూపంలో రచించి భారత కావ్య విశిష్టతను లోకానికి తెలియజేసిన మహాకవులన్నారు. ఏ ప్రవచనం వినడానికి వెళ్లిన అందులోని మంచిని మాత్రమే స్వీకరించి, ఆచరించాలన్నారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

# తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



## రైతు కార్డు పొందేందుకు పేర్లు నమోదు చేయించుకోవాలి : ఏవో

తెనాలి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నూతనంగా అందించనున్న రైతు కార్డు పొందేందుకు సొంత పంట భూములున్న ప్రతి రైతు వారి ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్‌తో రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమసాగర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. మండల గ్రామాల్లోని సొంత భూములున్న యజమానులు దగ్గరలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి వివరాలు అందిస్తే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. ఈ కార్డుల ద్వారా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, పంట ఉత్పత్తుల అమ్మకాలు తదితర అన్నింటికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

## క్రైస్తవ సమాజానికి ఫాదర్ దేవదాసు మార్గదర్శి

- ఆయన ఆశయ సాధన కోసం కృషి చేద్దాం
- బైబిల్ మిషన్ అధ్యక్షుడు శామ్యూల్ కిరణ్



ప్రసంగిస్తున్న శామ్యూల్ కిరణ్

పెదకాకాని, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రైస్తవ సమాజానికి ఫాదర్ ముంగమూరి దేవదాసు మార్గదర్శకంగా నిలిచారని కాకాని స్వస్థిశాల నిర్వాహకులు, బైబిల్ మిషన్ అధ్యక్షుడు జె.శామ్యూల్ కిరణ్ అన్నారు. జిల్లాలోని పెదకాకానితో పాటుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో క్రైస్తవ మానవాళికి సేవ చేయడానికి తన జీవితాన్ని అంకితం చేసిన ఆధ్యాత్మిక నాయకుడు, బైబిల్ మిషన్ వ్యవస్థాపకుడు ముంగమూరి దేవదాసు జ్ఞాపకార్థ కూడిక ఆదివారం నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆయా ప్రాంతాల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థన కూటముల్లో బైబిలు మిషను వైస్ ప్రెసిడెంటు పి.జాన్ దేవదాసు, సెక్రటరీ కోట్ల ప్రశాంత్‌కుమార్, జాయింట్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పెదరావూరులో దేవస్థాన నిర్మాణానికి శంకుస్థాపన

తెనాలి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదరావూరు సుబ్రహ్మణ్యపురంలో శ్రీ లక్ష్మీగణపతి, శ్రీ బాలాంబికా సమేత శ్రీ సర్వహితేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. ఉదయం 11.12 నిమిషాలకు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఆశీస్సులతో శంకుస్థాపన, భూమి పూజ జరుగుతాయని, భక్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు.

## రహీమ్‌సాహెబ్‌కు ఉత్తమ సేవా పురస్కారం

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణానికి చెందిన కవి, గాయకుడు, ఆర్టీసీ కండెక్టర్ షేక్ రహీమ్‌సాహెబ్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఆదివారం చిలకలూరిపేటలో జయజయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో రహీమ్ సాహెబ్ స్వీయ రచన గానామృతం చేసిన కవితలతో నిర్వాహకుల ప్రశంసలు అందుకున్నాడు. చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు చేతుల మీదుగా రహీమ్‌కు ఉత్తమకవి సేవా పురస్కారంను అందజేసి సత్కరించారు.

## స్విమ్మర్ నాగబ్రహ్మారెడ్డికి సన్మానం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా రివర్ క్రాసింగ్ పోటీల్లో మూడవ బహుమతి సాధించిన స్విమ్మర్ పిట్టు నాగబ్రహ్మారెడ్డిని ఆదివారం సత్కరించారు. సంగం జాగర్లమూడి స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఫిబ్రవరి 2న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రివర్ క్రాసింగ్ పోటీలు నిర్వహించింది. 31-40 ఏళ్ల గ్రూపులో ఆయన మూడవ బహుమతి పొందారు. పి.వాసు, నారాయణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, నిరంజన్ పాల్గొన్నారు. పదవి విరమణ చేసిన అసోసియేషన్ సభ్యుడు అర్జునరావును సత్కరించారు.

## కొలకలూరు ఎస్సీ కాలనీలో తాగునీరు కలుషితం



పైపులైను ద్వారా వస్తున్న నీటిలో అడుగున పేరుకున్న మురుగు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలకలూరు ఎస్సీ కాలనీలో పైప్‌లైన్ ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు కలుషితమవుతున్నాయని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. గతంలో ఉన్న పాత పైప్‌లైన్ ద్వారా వాటర్ ట్యాంకు నుంచి కాలనీకి నీరు సరఫరా అవుతుంది. ఆ నీటిని తాగేందుకు, ఇతర అవసరాలకు కాలనీ వాసులు సద్వినియోగం చేసుకుంటారు. ఇంతటి ఉపయోగకరంగా ఉండే నీటి పైపు లైన్లకు లీకులు ఉండటంతో కాలువలో ప్రవహించే మురుగునీరు అందులోకి చేరి గృహాలకు కలుషితమైన నీరు వస్తున్నట్లు వాపోతున్నారు. గతంలో ఇదే కాలనీలో కలుషిత నీరు తాగి డయేరియా లక్షణాల బారిన పడి ఓ బాలిక మృతి చెందగా పలువురు వైద్యశాలలో చికిత్స పొంది బయటపడిన పరిస్థితిని తలుచుకుని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు కలుషితమవుతున్న నీటిని పరిశీలించి సురక్షిత నీరు అందేలా చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

# తరలింపు భారం

- కంపోస్టు యార్డులో వ్యర్థాల విభజనకు భారీ యంత్రం
- జిందాల్ పవర్ ప్లాంటుకు తరలించేందుకు ఏర్పాట్లు



వ్యర్థాలను వేరు చేసేందుకు ఏర్పాటు చేసిన యంత్రం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తెనాలి పురపాలక సంఘానికి వ్యర్థాల తరలింపు తలకు మించిన భారంగా మారింది. బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్టు యార్డులో వ్యర్థాల గుట్టలు కొండలా పేరుకుపోయాయి. మున్సిపల్ ఆదాయంలో సింహభాగం పట్టణ పారిశుధ్యానికే ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రతిరోజు 40 ట్రాక్టర్ల వరకు సేకరించిన వ్యర్థాలు కంపోస్టు యార్డుకు చేరుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యర్థాల నిర్వహణపై తగిన ప్రణాళిక లేకపోవడంతో ఆరు ఎకరాల్లో ఉన్న కంపోస్టు యార్డులో నాలుగు ఎకరాలకు పైగా వ్యర్థాలు ఆక్రమించేశాయి. ఇంకా అక్కడ వ్యర్థాలు వేయడానికి తగినంత స్థలం లేకపోవడం, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ప్రజా ప్రతినిధులు వ్యర్థాల సమస్యపై దృష్టి సారించారు. ఈ వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే జిందాల్ పవర్‌ప్లాంటుకు తరలించే ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రతిరోజు వస్తున్న వ్యర్థాలను ప్లాంటుకు తరలిస్తున్నారు. వ్యర్థాలను విభజించేందుకు భారీ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ యంత్రం పని చేసేందుకు



కంపోస్టు యార్డులో కొండలా ఉన్న వ్యర్థాల గుట్టలు

అవసరమైన విద్యుత్, నీరు, మున్సిపాలిటీ సమకూర్చింది. వ్యర్థాల తరలింపు కోసం ప్రభుత్వం ఇచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3 కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశాలు కనపడుతున్నాయి. గతం లో మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు వ్యర్థాల నిర్వహణపై తగిన ప్రణాళికలు వేసి కంపోస్టు యార్డులో మొక్కలు పెంచి కొంత భాగాన్ని వనం చేసిన విధానాలు కూడా ఉన్నాయి. ప్రతిరోజు ఎక్కడికక్కడ వ్యర్థాలను విభజించి విక్రయించి మున్సిపాలిటీ ఆదాయాన్ని కూడా పెంచారు. పట్టణంలో రోజు రోజుకు జనాభా పెరగడంతో పాటు వ్యర్థాల ఉత్పత్తి కూడా ఎక్కువగానే ఉంటోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రణాళికబద్ధంగా వ్యవహరించకపోతే మున్సిపాలిటీకి వ్యర్థాల సమస్య జటిలంగా మారుతుందని పలువురు సూచిస్తున్నారు.

## ముట్లూరులో ఆంధ్రా ప్రైమ్ హాస్పిటల్ ఉచిత వైద్యశిబిరం



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన ఆంధ్రా ప్రైమ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ముట్లూరులో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు వైద్యసేవలు పొందారు. శిబిరంలో కంటి పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు, బ్లడ్‌గ్రూప్, రక్తపోటు, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, పల్మనాలజీ, ఆప్తమాలజీ తదితర విభాగాల్లో రోగులకు వైద్యసేవలు అందించారు. శిబిరంలో సుమారు 260 మందికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఆంధ్రా ప్రైమ్ హాస్పిటల్ నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ అచ్చంశెట్టి అన్వేష్, డాక్టర్ కాసుల సాయి రాజశేఖర్, డాక్టర్ సీహెచ్ జగదీష్, డాక్టర్ మాధవీలత, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ కృష్ణారావుకు సన్మానం



కృష్ణారావు దంపతులను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తెనాలి సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘ సమావేశం ఆదివారం చెంచుపేటలో నిర్వహించారు. డాక్టర్ ఎస్‌వి కృష్ణారావు దంపతులను ఘనంగా సన్మానించారు. మధుమేహ వ్యాధిపై ఆయన సూచనలు, సలహాలు అందజేశారు. అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, నాగేశ్వరరావు, రాంబాబు, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత మృతికి ఎమ్మెల్యే నివాళి



కుందేటి శ్రీనివాస్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తదితరులు

చేబ్రోలు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ చేబ్రోలు గ్రామ నాయకుడు కుందేటి శ్రీనివాస్ గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. శ్రీనివాస్ మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్ కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. చేబ్రోలు మండలంలోని తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు శ్రీనివాస్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# ఆశాజనకంగా తమలపాకు సాగు

- ఈ ఏడాది పెరిగిన ధరలు
- తగ్గుతున్న సాగు విస్తీర్ణం

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): భారతీయ జీవన విధానంలో తమలపాకు లేకుండా గృహాల్లో ఒక శుభకార్యం కూడా జరుపుకోరు. అంతే కాకుండా భారతీయులు స్వీకరించే ఆహారం చివరిలో తమలపాకు వినియోగించి తయారు చేసే తాంబూలం స్వీకరించాల్సిందే. ఎన్నో విశిష్టతలు కలిగిన తమలపాకు గృహాలు, ఆలయాల్లో జరిగే పూజల్లో సైతం విరివిగా వినియోగిస్తారు. ఆయుర్వేదంలో సైతం తమలపాకు లేకుండా మందులు తీసుకోవడం ఉండదు. అనాదిగా భారతీయ జీవన విధానంతో పెనవేసుకుపోయిన తమలపాకు సాగు పొన్నూరు ప్రాంత రైతులకు మిశ్రమఫలితాలను అందిస్తుంది. ఈ ఏడాది ఆకుల ధరలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ దిగుబడులు మాత్రం అంతంత మాత్రంగానే వస్తున్నట్లు రైతులు వాపోతున్నారు.

### సాగుకు పొన్నూరు ప్రాంతం ప్రసిద్ధి

తమలపాకు సాగుకు పొన్నూరు ప్రాంతం ప్రసిద్ధి చెందింది. దశాబ్దాల క్రితమే పొన్నూరు ప్రాంతంలోని చింతలపూడి, ములకుదురు, మాచవరం, నిడుబ్రోలు, వీవర్స్‌కాలనీ, ఆల్లూరు, ఆరెమండ, కట్టెంపూడి, తాళ్ళపాలెం వంటి గ్రామాల్లో మెట్టభూముల్లో సు మారు 1000ఎకరాల్లో తమలపాకు సాగు చేస్తున్నారు. తమలపాకు తోటల్లో పనులు చేసేందుకు గోదావరి జిల్లాలలోని తుని ప్రాంతం నుంచి వందల కుటుంబాలు చింతలపూడి, వీవర్స్ కాలనీ వంటి ప్రాంతాల్లో వలసలు వచ్చి జీవనోపాధి పొందుతున్నారు. స్థిరనివాసాలు సైతం ఏర్పాటు చేసుకున్నారు. సాగులోనే కాకుండా విక్రయాలు, ఎగుమతులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

### గిట్టుబాటు లేక తగ్గుతున్న సాగు విస్తీర్ణం

10ఏళ్ల క్రితం వరకూ 1000ఎకరాల్లో సాగవుతున్న తమలపాకు నేడు క్రమేణా 600 ఎకరాలకు తగ్గిపోయింది. ప్రధానంగా కూలీల కొరత, అధిక ధరలు, అధిక వేతనాలు, ఆకు ధరల పతనం, వంటి పరిస్థితులు సాగును తగ్గించి వేశాయి. తమలపాకు సాగుచేయడానికి ప్రస్తుతం ఎకరాకు రూ2.50లక్షలు ఖర్చవుతుంది. దిగుబడులు వచ్చి ధరలు బాగుంటే పెట్టిన పెట్టుబడితో పాటు లాభాలు వస్తాయి. కానీ కొన్ని ఏళ్లుగా వేరుకుళ్లు తెగుళ్ల ఆశిం చి, ప్రకృతి వైపరీత్యాలు పెరిగి పంటలు దెబ్బతింటున్నాయి. అంతే కాకుండా నిలకడలేని ధరలు సాగుదారులకు నష్టాలని చవిచూపిస్తున్నాయి. ఈ ఏడాది శుభకార్యాలు విరివిగా జరగడంతోపాటు ఉత్తరాది రాష్ట్రాల నుంచి తమలపాకు డిమాండ్ పెరిగింది. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలకు ఎగుమతి పెరగడంతో ప్రస్తుతం వందపంతాలు తమలపాకు ధరలు రూ.3500 వరకు చెల్లిస్తున్నారు. గత ఏడాది ఈ సమయంలో వంద పంతాలు ధర రూ.1000 మాత్రమే పలికింది. దీనికి తోడు డిమాండ్ లేకపోవడంతో ఈ ఏడాది రైతులు సాగు విస్తీర్ణం తగ్గించారు. ప్రస్తుతం ధర బాగున్నప్పటికీ క్రమంగా పెరుగుతున్న ఎండలతో ఆకు దిగుబడి తగ్గుతుందని రైతుల్లో ఆందోళన ఉంది. ప్రస్తుతం ఎకరాకు ఒక కోతకు 25గంపలు దిగుబడి వస్తుండగా ఎగుమతి దారులు రూ.80వేల వరకూ చెల్లిస్తున్నారు. అయితే దిగుబడులు తగ్గిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ప్రతి ఏడాది లక్షలాది రూపాయలు ఖర్చు చేసి సాగుచేస్తున్న తమలపాకుల పంట అందరి నోరు పండిస్తున్నప్పటికీ రైతులు నోర్లు మాత్రం పండటంలేదని రైతుల్లో నిర్వేదం వ్యక్తమవుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్లాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం వాణిజ్య పంటలైన తమలపాకు సాగుకు కూడా రాయితీ ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



చింతలపూడిలో సాగులో ఉన్న తమలపాకు తోట

## ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : షరాఫ్ బజారులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం



ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శివశంకర్

కల్యాణం జరిపించారు. వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, మారుతీ, అర్చక బృందం కల్యాణ ఘట్టాన్ని కమనీయంగా వివరించారు. స్వామి వారికి తిరుచ్చి వాహన సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరెడ్డి, కిరణ్‌కుమార్, సురేష్, శాండిల్య, అనురాధ, వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, రామారావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శివశంకర్‌కు సేవా భగవాన్ పురస్కారం



ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శివశంకర్

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తెనాలికి చెందిన సత్యం శివం సుందరం సామాజిక సేవా కేంద్రం వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్‌కు సేవా భగవాన్ పురస్కారం లభించింది. ఈ కేంద్రం ద్వారా ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన చిలకలూరిపేట జైసాయి ట్రస్ట్ నుంచి ఆదివారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న ఆయనను కాపు యువజన సమితి, పూర్వ విద్యార్థుల సంఘం, తన్నీరు ట్రస్ట్, వీరబ్రహ్మేంద్ర ట్రస్ట్ సంస్థల సభ్యులు అభినందించారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావుకి మద్దతుగా ప్రచారం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : శాసన మండలి అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయం కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం చేశారు. ఐతానగర్‌లో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.



ప్రచారం చేస్తున్న శివసాంబిరెడ్డి

శాసన మండలిలో ప్రస్తుతం సభ్యుడిగా ఉన్న ఆయన పలు సమస్యలను మండలి దృష్టికి తీసుకువెళ్లినట్టు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, ప్రకాష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ చాలీసా పారాయణ పోటీలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : నెహ్రూ రోడ్డులోని గోవర్ధన స్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ చాలీసా పారాయణ పోటీలు నిర్వహించారు. శ్రీలక్ష్మి శారదా సంగీత నిలయం ఆధ్వర్యంలో బాల బాలికలకు రెండు విభాగాల్లో పోటీలు జరిపారు.చాలీసాలోని 40 శ్లోకాలను రాగయుక్తంగా ఆలపించారు.



విజేతలతో నిర్వాహకులు

జూనియర్ విభాగంలో విజేతలు పార్దు, తన్మయి, లక్ష్మీప్రణతి, సీనియర్స్ విభాగంలో సుచరిత, రత్న ప్రియాంక, సాయితేజస్విలకు బహుమతులు అందజేశారు. 9 మందికి కన్సోలేషన్ బహుమతులు ఇచ్చారు. ఆదినారాయణ, శారదా చలపతి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన పోటీల్లో అంజనేయ శాస్త్రి, కొండపి శ్రీనివాసరావు, సౌజన్య, బాలచంద్రమౌళి, రఘు పర్యవేక్షించారు.

## రక్తదానంతో ప్రాణదాతలు కావాలి

### గురుస్వామి వాసంశెట్టి సత్యనారాయణ

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని శ్రీ స్వామి అయ్యప్ప భక్త బృందం సేవా సమితి గురుస్వామి వాసంశెట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక మారీసుపేట మఠంబజార్‌లోని శ్రీ సువర్ణ సూర్యకాంత స్వామి మందిరంలో శ్రీ స్వామి అయ్యప్ప భక్త బృందం సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గురుస్వామి సత్యనారాయణ పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిదానాల కంటే రక్తదానం గొప్పదన్నారు. రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలు కాపాడిన వారమౌతామన్నారు. ఎటువంటి అపోహలకు తావులేకుండా రక్తదానం చేయాలని కోరారు. శిబిరంలో పలువురు సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సభ్యులు లక్కోజు నరేంద్ర, ఆకురాతి సురేష్, కొత్తమాసు రామకృష్ణ నందిపాటి వెంకటరామయ్య, ప్రసాద్, గోపి తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న సేవా సమితి సభ్యులు